విశాఖపట్టణం
శుక్రవారం 17 జులై 2026

For a pure tomorrow..

# జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:174 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool



## విశాఖలో కోవిడ్ పాజిటివ్

రాష్ట్రంలో మరో నాలుగు పాజిటివ్ కేసులు

వైద్యారోగ్య శాఖ అప్రమత్తం

2

నెల రోజుల్లో భోగాపురం ఎయిర్ పోర్టు

## ప్రారంభం

నిర్మాణ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి

డీజీసీఏ అనుమతులు కూడా వచ్చాయి

ప్రధాని మోడీ చేతుల మీదుగా ప్రారంభిస్తాం

కేంద్ర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు

3

# స్థానిక సమరానికి సై..!

సెప్టెంబర్ లో లోకల్ బాడీ ఎన్నికలు?

తొలుత మున్సిపాల్టీలు, కార్పొరేషన్లకు ఎలక్షన్

అక్టోబర్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ పోరు

చివరలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ







(అమరావతి - జయజయహే)

రాష్ట్ర రాజకీయాల్లో మరో భారీ సమరానికి వేదిక సిద్ధమవుతోంది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణప చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అత్యంత వేగంగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది సెప్టెంబర్ లేదా అక్టోబర్ నెలలోనే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. పట్టణ ప్రాంత ఓటర్లపై పట్టు సాధించడమే లక్ష్యంగా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఎన్నికల సన్నాహక విధులను వేగవంతం చేశారు. మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల పదవీ కాలం ముగిసి, ప్రస్తుతం అవి ప్రత్యేకాధికారుల పాలనలో ఉన్నాయి. ప్రజాస్వామ్య బద్ధంగా పాలకమండళ్లను తీసుకురావడానికి ప్రభుత్వం మూడు అంచెల వ్యూహాన్ని అమలు చేయబోతోంది. తొలుత సెప్టెంబర్ నెలలో నగరపాలక ఎన్నికలను పూర్తి చేస్తారు. ఆ వెంటనే అక్టోబర్‌లో ఎంపీటీసీ , జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. చివరి విడతలో గ్రామీణ ప్రాంతాల్లోని గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించేలా ఒక పక్కా షెడ్యూల్ రూపకల్పనపై కసరత్తు జరుగుతోంది. ఈ లోకల్ బాడీ పోరుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం సైతం ..మిగతా 2లో




## వైసీపీ సూపర్ యాప్

జగన్ 2.ఓ పేరుతో డిజిటల్ విప్లవం

కంటెంట్ నేరుగా అప్‌లోడ్‌కు ఛాన్స్

పలు మాధ్యమాల్లో వైసీపీ కంటెంట్ డిలీట్

ప్రత్యామ్నాయ వేదికగా ఆవిష్కరించిన జగన్

(తాడేపల్లి - జయజయహే)

లసమకాలీన రాజకీయాల్లో డిజిటల్ నెట్‌వర్కింగ్, సోషల్ మీడియా వ్యూహాలు అత్యంత కీలకంగా మారిన తరుణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక విప్లవాత్మక అడుగు వేసింది. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో అధికారిక జగన్ 2.ఓ సూపర్ యాప్ ను ఘనంగా ఆవిష్కరించారు. ఇతర సామాజిక మాధ్యమాల్లో వైసీపీ కార్యకర్తల కంటెంట్‌ను అణచివేస్తున్నారన్న కారణంగా , ఎవరూ అడ్డుకోలేని విధంగా సొంత ప్లాట్‌ఫామ్‌ను రూపొందించుకోవడం ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ యాప్ ఆవిష్కరణ సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత సోషల్ మీడియా వేదికల్లో తమ పార్టీ శ్రేణులు పోస్ట్ చేస్తున్న కంటెంట్‌ను కుట్రపూరితంగా డిలీట్ ..మిగతా 2లో

# ఆంధ్రప్రదేశ్.. మీకు సారీ చెబుతోంది



పుట్టిన స్థానంను వదిలి వెళ్లడం కలిచి వేస్తోంది

ప్రస్థానం ఎక్కడ మొదలైందో అక్కడా కొనసాగాలి

మా తలుపులు, హృదయాలు ఎల్లప్పుడూ మీకు తెరిచే ఉంటాయి

అమరరాజా కొత్త ప్లాంట్ ప్రారంభోత్సవం వేళ మంత్రి లోకేశ్ ట్వీట్

(హైదరాబాద్ - జయజయహే)

తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లి వద్ద రూ. 9,500 కోట్ల పెట్టుబడితో అమరరాజా సంస్థ నిర్మిస్తున్న గిగా కారిడార్‌లో భాగంగా కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ ను విజయవంతంగా ప్రారంభించింది. ఈ ప్లాంట్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ప్రారంభించగా, అమరరాజా అధినేత గల్లా జయదేవ్ సామాజిక ..మిగతా 3లో

## పోర్టుల విస్తరణకు గ్రీన్ సిగ్నల్

ఫేజ్ 2 కోసం బారీగా భూ సేకరణకు నిర్ణయం

రూ. 1638 కోట్లతో 6,248 ఎకరాల సేకరణ

పరిపాలనా అనుమతులు మంజూరు చేసిన ప్రభుత్వం

2

ఈడీ కస్టడీకి లిక్కర్ స్కామ్

## నిందితులు

మూడు రోజుల పాటు విచారణ

తదుపరి చర్యలు ఇక వేగవంతం

3

ఆ ఘటనలపై

## సమగ్ర దర్యాప్తు

మూలపేటలో రాకేశ్ అనే యువకుడు హత్య

గొల్లప్రోలులో మరో యువకుడు హతం

బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలి

అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాలు



(అమరావతి - జయజయహే)

కాకినాడ జిల్లాలోని గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మండలం మూలపేట ప్రాంతాల్లో జరిగిన ఘటనలపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మద్యం మత్తులో, క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు కుటుంబాలను ఛిన్నాభిన్నం చేయడమే కాకుండా, సంబంధిత వ్యక్తుల భవిష్యత్తును కూడా అంధకారంలోకి నెడతాయని పేర్కొన్నారు. గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మండలం మూలపేట ప్రాంతాల్లో ..మిగతా 2లో

భర్తను గుడికి తీసుకెళ్లి..

## ప్రియుడుతో మర్డర్

వివాహేతర సంబంధానికి అడ్డు అని భార్య మాస్టర్ ప్లాన్

సీసీ టీవీ పుటేజీలో కీలక ఆధారాల సేకరణ

చిత్తూరు జిల్లాలో మరో దారుణ ఘటన

(చిత్తూరు - జయజయహే)

భర్తను గుడికి తీసుకెళ్లిన భార్య.. బాయ్ ఫ్రెండ్ తో కలిసి అతన్ని చంపేసింది.. ఆ తర్వాత ఏం తెలియనట్లు అక్కడి నుంచి భర్త బైక్‌పైనే ప్రియుడితో కలిసి పరారైంది.. ఈ దారుణ ఘటన చిత్తూరు జిల్లా గుడిపల్లి మండలంలో చోటుచేసుకుంది. భర్త ఏడాది బిడ్డతో కలిసి మల్లప్పకొండ దర్శనానికి వెళ్లిన భార్య మాస్టర్ ప్లాన్ అమలు చేసింది. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను ..మిగతా 2లో





## రథయాత్రలో తొక్కిసలాట

ఒకరు మృతి, వందలాది భక్తులకు గాయాలు

రంగంలోకి దిగిన సహాయక బృందాలు

భారీ జన సందోహంతో జగన్నాథుని ఆలయం కిటకిట

2

## 22న తల్లికి వందనం

రూ.10,120.78 కోట్ల నిధుల విడుదల

67.47 లక్షల మంది విద్యార్థులు అర్హులు

22న జాబితా ప్రకటన.. అదే రోజున ఖాతాల్లో జమ

(అమరావతి - జయజయహే)

విద్యార్థులు, వారి తల్లులకు కూటమి ప్రభుత్వం అదిరిపోయే గుడ్ న్యూస్ అందించింది. బడులకు వెళ్లే ప్రతి చిన్నారికి ఆర్థిక భరోసా కల్పించే తల్లికి వందనం పథకం నిధులను ఈ నెల 22న విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఇందుకోసం విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ రూ. 10,120.78 కోట్ల నిధుల ..మిగతా 2లో



For a pure tomorrow.. జయహో


# రథయాత్రలో తొక్కిసలాట

### ఒకరు మృతి, వందలాది భక్తులకు గాయాలు

### రంగంలోకి దిగిన సహాయక బృందాలు

### భారీ జన సందోహంతో జగన్నాధుని ఆలయం కిటకిట

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)



ఒడిశాలోని పూరీలో గురువారం జరిగిన ప్రపంచ ప్రసిద్ధ జగన్నాథ రథయాత్రలో తొక్కిసలాట చోటు చేసుకుంది. భారీగా తరలివచ్చిన భక్తుల కారణంగా గ్రాండ్ రోడ్ (బడా దండా) ప్రాంతంలో తీవ్ర రద్దీ నెలకొంది. ఈ క్రమంలో తొక్కిసలాటలాంటి పరిస్థితులు ఏర్పడడంతో వందలాది మంది భక్తులు అస్వస్థతకు గురయ్యారు. ప్రాథమిక సమాచారం ప్రకారం.. ఒకరు మృతి చెందగా, సుమారు 100 మందికి పైగా గాయాలు అయినట్లు తెలుస్తోంది. అత్యవసర సహాయక బృందాలు వెంటనే స్పందించి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించి చికిత్స కోసం ఆసుపత్రులకు పంపించాయి. స్థానిక వర్గాల సమాచారం ప్రకారం.. ఈ ఘటనలో ఒక భక్తుడు మృతి చెందినట్లు సమాచారం. ఊపిరాడక స్పృహ కోల్పోయిన అతడిని వెంటనే పూరీ జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు తెలుస్తోంది. అయితే ఈ మరణంపై ఇప్పటివరకు అధికారుల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఘటన సమాచారం అందుకున్న ప్రత్యేక సహాయక బృందం , పోలీసులు, వైద్య సిబ్బంది వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. రద్దీ ప్రాంతంలో చిక్కుకున్న భక్తులను బయటకు తీసుకువచ్చి వైద్య సేవలు అందించారు. పరిస్థితి అదుపులోకి వచ్చే వరకు గ్రాండ్ రోడ్‌లో జనసమూహాన్ని నియంత్రించేందుకు అదనపు భద్రతా బలగాలను మోహరించారు. భక్తులు సురక్షితంగా రథయాత్రను వీక్షించేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా, జగన్నాథ రథయాత్ర గురువారం సంప్రదాయబద్ధంగా ప్రారంభమైంది. 12వ శతాబ్దానికి చెందిన శ్రీ జగన్నాథ ఆలయం నుంచి గుండిచా ఆలయం వరకు జరిగే ఈ వార్షిక మహోత్సవాన్ని వీక్షించేందుకు దేశ విదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు పూరీకి చేరుకున్నారు. గంటల మోతలు, శంఖారావాల మధ్య చక్రరాజ సుదర్శనుడిని ముందుగా ఆలయం నుంచి బయటకు తీసుకువచ్చి సుభద్రాదేవి రథంపై ప్రతిష్ఠించారు. తర్వాత సుభద్రాదేవి విగ్రహాన్ని సంప్రదాయ 'శూన్య పహండి' వేడుకలో రథం వద్దకు తీసుకువచ్చారు. అనంతరం బలభద్రుడు, చివరగా జగన్నాథ స్వామి విగ్రహాలను ఆలయం నుంచి బయటకు తీసుకురాగానే భక్తులు "జై జగన్నాథ్" నినాదాలతో గ్రాండ్ రోడ్‌ను మార్మోగించారు. అయితే భారీ జనసందోహం కారణంగా ఏర్పడిన రద్దీ ఈసారి రథయాత్రలో ఆందోళనకర పరిస్థితులకు దారితీసింది.

## ఆ ఘటనలపై సమగ్ర దర్యాప్తు

మొదటి పేజీ తరువాయి...

చోటుచేసుకున్న సంఘటనలే ఇందుకు నిదర్శనమని చెప్పుకొచ్చారు. ఈ రెండు ఘటనలపై కాకినాడ జిల్లా పోలీసులు సమగ్ర దర్యాప్తు నిర్వహించి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా సున్నితమైన ప్రాంతాలు గుర్తించి అవగాహన సదస్సులు నిర్వహించాలని పవన్ కల్యాణ్ సూచించారు.

**మూలపేటలో రాకేశ్ మృతి**

కాగా, కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం మూలపేటలో ఓ వ్యక్తితో కొంతమంది యువకులకు గొడవ జరిగింది. ఈ ఘటనలో పెదపూడి మండలం రామేశ్వరానికి చెందిన రాకేశ్ (25) అనే యువకుడు మృతిచెందాడు. తన అమ్మమ్మ వేమగిరి రమణమ్మ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు బుధవారం మూలపేటకు రాకేశ్ వచ్చాడు. ఈ సందర్భంగా రాకేశ్ చెల్లి గ్రామంలోని ఓ దుకాణం వద్దకు వెళ్లగా, స్థానికంగా ఉన్న ఐదుగురు యువకులు ఆమెతో అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధించారు. ఈ క్రమంలో తన అన్న రాకేశ్.. ఐదుగురు యువకులను మందలించాడు. వీరిలో వంశీ అనే యువకుడు కోపంతో రాకేశ్‌ను చాకుతో పొడవడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు.

**గొల్లప్రోలులో లింగం అర్జునుడు మృతి..**

గొల్లప్రోలు నగర పంచాయతీ రెండో వార్డు మాజీ కౌన్సిలర్ సంధ్యా భర్త లింగం అర్జునుడు, తన స్నేహితులతో కలిసి దారపల్లి వాటర్ ఫాల్స్‌కు వెళ్లాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన స్థానికుడు బచ్చల మారుతి పవన్ కల్యాణ్ అనే వ్యక్తితో అర్జునుడికి ఓ విషయంలో గొడవ జరిగింది. ఈక్రమంలో మాటామాటా పెరిగి తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలోనే అర్జునుడి కడుపులో బచ్చల మారుతి పవన్ కల్యాణ్ బలంగా పొడిచాడు. కత్తిపోట్లకు గురైన అర్జునుడిని పిఠాపురంలోని కార్తికేయ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అర్జునుడు ఆస్పత్రిలోనే మృతిచెందాడు. ఈ రెండు ఘటనలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. పోలీసులు సమగ్ర దర్యాప్తు జరపాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు.

## వైసీపీ సూపర్ యాప్

మొదటి పేజీ తరువాయి...




చేయిస్తున్నారని మండిపడ్డారు. ఈ కుట్రలను తిప్పికొట్టడానికే జగన్ 2.ఓ సూపర్ యాప్ ను తీసుకువచ్చినట్లు ప్రకటించారు. ఇది పూర్తి స్థాయిలో పార్టీకి చెందిన సొంత యాప్ కావడం వల్ల, ఇందులో కార్యకర్తలు తమ అభిప్రాయాలను ఎటువంటి భయం లేకుండా నిర్భయంగా పంచుకోవచ్చని, బయటి వ్యక్తులు ఎవరు పడితే వారు కంటెంట్‌ను డిలీట్ చేసే హక్కు ఉండదని ఆయన స్పష్టం చేశారు. ఈ సూపర్ యాప్ ద్వారా పార్టీలోని క్షేత్రస్థాయి చిన్న కార్యకర్త మొదలుకుని తాడేపల్లి కేంద్ర కార్యాలయం వరకు ప్రతి ఒక్కరూ నిరంతరం అనుసంధానమై ఉంటారని జగన్ వివరించారు. గ్రామం, నియోజకవర్గ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి నేతల వరకు అందరూ ఒకే వేదికపైకి రావడం వల్ల సమన్వయం సులువవుతుందన్నారు. అంతేకాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలతో పాటు, రాజకీయ ప్రత్యర్థులు లేదా పోలీసుల వేధింపుల వల్ల ఇబ్బందులు పడుతున్న కార్యకర్తలు ఈ యాప్ ద్వారా నేరుగా పార్టీ నాయకత్వంతో టచ్‌లో ఉండే అద్భుత అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యకర్తలకు భరోసా కల్పించేలా ఈ యాప్‌లో మరికొన్ని ప్రత్యేక ఫీచర్లను పొందుపరిచారు. పార్టీ నిర్వహించే ప్రతి సమావేశం, ప్రెస్ మీట్లు, ముఖ్యమైన అధికారిక ప్రకటనలు లైవ్ ఫీడ్ ద్వారా ఈ యాప్‌లో అందుబాటులో ఉంటాయి. అలాగే, ప్రస్తుతం వైసీపీ నిర్వహిస్తున్న డిజిటల్ డైరీ ని కూడా ఈ యాప్‌తో అనుసంధానం చేశారు. దీనివల్ల వేధింపులకు గురవుతున్న కార్యకర్తలు నేరుగా యాప్ ద్వారానే డిజిటల్ డైరీలో ఫిర్యాదులను నమోదు చేయవచ్చని, బాధితులకు గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ శ్రేణులన్నీ అండగా నిలబడతాయని జగన్ భరోసా ఇచ్చారు. ఇతర సోషల్ మీడియా వేదికల్లో వైఎస్సార్‌సీపీపై జరుగుతున్న అనుచిత విమర్శలు, మార్ఫింగ్ వీడియోలపై చట్టపరమైన ఫిర్యాదులు చేస్తూనే.. మరోవైపు పార్టీని డిజిటల్ పరంగా స్వావలంబన వైపు నడిపించేందుకు ఈ సొంత ప్లాట్‌ఫామ్ ఉపయోగపడుతుందని జగన్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఈ యాప్‌ను సాంకేతికంగా మరింత అభివృద్ధి చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ చారిత్రాత్మక డిజిటల్ అడుగు ద్వారా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాబోయే రోజుల్లో తన సోషల్ మీడియా ఉనికిని మరింత శక్తివంతంగా మార్చుకోబోతోందని భావిస్తున్నారు.



## పోర్టుల విస్తరణకు గ్రీన్ సిగ్నల్

### ఫేజ్ 2 కోసం బారీగా భూ సేకరణకు నిర్ణయం

### రూ. 1638 కోట్లతో 6,248 ఎకరాల సేకరణ

### పరిపాలనా అనుమతులు మంజూరు చేసిన ప్రభుత్వం

(అమరావతి - జయజయహే)

రాష్ట్ర ఆర్థిక రూపురేఖలను మార్చేలా, సముద్ర తీర ఆధారిత పరిశ్రమలకు ఊతమిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న మూడు ప్రధాన ఓడరేవుల (పోర్టుల) రెండో విడత (ఫేజ్-2) విస్తరణ పనుల కోసం భారీగా భూమిని సేకరించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. శ్రీకాకుళం జిల్లాలోని మూలపేట, కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం, నెల్లూరు జిల్లాలోని రామాయపట్నం పోర్టుల అభివృద్ధి కోసం రూ.1,638 కోట్ల అంచనా వ్యయంతో మొత్తం 6,248 ఎకరాల భూమిని సేకరించేందుకు పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్ర మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు ఈ భూసేకరణకు సంబంధించిన జీవోను విడుదల చేశారు. ఈ భూసేకరణకు అయ్యే ఖర్చును పూర్తిగా ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు తన సొంత వనరుల నుంచి భరిస్తుందని ఆయన స్పష్టం చేశారు. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఈ మూడు పోర్టుల అభివృద్ధి రాష్ట్రానికి ఎంతో కీలకం కానుంది. శ్రీకాకుళం జిల్లా మూలపేట ఓడరేవు విస్తరణ కోసం 1,903 ఎకరాల భూమిని సేకరిస్తున్నారు. ఇందుకోసం రూ.440 కోట్లు కేటాయించారు. ఈ బడ్జెట్‌లోనే భూమి కోల్పోతున్న నిర్వాసితులకు పునరావాసం, పునరుద్ధరణ ప్యాకేజీల ఖర్చులు కూడా కలిసి ఉన్నాయి. కృష్ణా జిల్లా మచిలీపట్నం పోర్టు ఈ ప్రాజెక్ట్ ఫేజ్-2 అభివృద్ధి కోసం 1,421 ఎకరాల భూమిని సేకరించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.347 కోట్లను కేటాయించింది. నెల్లూరులోని రామాయపట్నం పోర్టు విస్తరణ కోసం భూమిని సేకరిస్తున్నారు. ఇక్కడ 2,924 ఎకరాల భూసేకరణ కోసం రూ.851 కోట్లను కేటాయిస్తూ ప్రభుత్వం పరిపాలనా అనుమతులు ఇచ్చింది. ఈ పోర్టుల నిర్మాణం పూర్తయితే ఏపీ సముద్ర తీర ప్రాంతం పారిశ్రామికంగా ఎంతో వృద్ధి చెందుతుందని, స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని అధికారులు భావిస్తున్నారు. ఎగుమతులు, దిగుమతులకు కేంద్రాలుగా మారి రాష్ట్ర ఆదాయాన్ని పెంచడంలో ఇవి కీలక పాత్ర పోషించనున్నాయి.

## విశాఖలో కోవిడ్ పాజిటివ్

### రాష్ట్రంలో మరో నాలుగు పాజిటివ్ కేసులు

### వైద్యారోగ్య శాఖ అప్రమత్తం

(అమరావతి - జయజయహే)

మళ్లీ కరోనా కలకలం రేపుతోంది. రాష్ట్రంలో కోవిడ్ కేసులు పెరిగిపోతున్నాయి. జూన్ 26 నుంచి12 కొవిడ్ కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. కడప,గుంటూరు, కాకినాడ జిల్లాల్లో కేసులు నమోదవుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ కొవిడ్ పాజిట్‌తో నలుగురు మృతి చెందారు. హోమ్ ఐసోలేషన్‌లో ముగ్గురు బాధితులున్నట్లు తెలుస్తోంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మరో ఇద్దరు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే మళ్లీ కోవిడ్ కేసులు నమోదు అవుతుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీ వైద్య ఆరోగ్య శాఖ సూచిస్తోంది. ఇక విశాఖ జిల్లాలోనూ కరోనా లక్షణాలతో ఓ వ్యక్తి చికిత్స పొందుతుండగా, ల్యాబ్ రిపోర్టులో పాజిటివ్ వచ్చింది. దీంతో ఆయన్ను ఐసోలేషన్ లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. అయితే దేశవ్యాప్తంగా పలు నగరాల్లో కోవిడ్-19 కేసులు బయటపడటంతో, కరోనావైరస్ తిరిగి రావడం, మళ్లీ లాక్‌డౌన్ గురించి గుర్తు చేసుకుంటున్నారు. మరోసారి 2020 నాటి తీవ్రమైన పరిస్థితి వైపు వెళ్తున్నామా అనే ఆందోళనను ప్రజలలో మళ్లీ టెన్షన్ పెట్టిస్తోంది. అయితే, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని ఆరోగ్య నిపుణులు, వైద్యుల, ప్రభుత్వ అధికారులు చెబుతున్నారు.





## భర్తను గుడికి తీసుకెళ్లి.. ప్రియుడుతో మర్డర్

మొదటి పేజీ తరువాయి...

కడతేర్చింది.. అనుమానితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఈ ఘటన అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నారు. వివరాల ప్రకారం.. శాంతిపురం మండలం బోయినపల్లికి చెందిన హాసినికి తమిళనాడులోని సూలగిరికి చెందిన రమేష్ తో రెండేళ్ల క్రితం పెళ్లయింది. వీళ్లకు ఏడాది కూతురు ఉంది. హోసూరులో ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న రమేష్ హాసినిని పెళ్లి చేసుకుని భార్య బిడ్డకు ఏ కష్టం రాకుండా చూసుకుంటున్నాడు. అయితే హాసిని చిన్ననాటి స్నేహితుడితో ఉన్న ప్రేమ బంధం కొనసాగించింది.. ఈ ప్రేమబంధం భార్యాభర్తల బంధానికి అడ్డుగా మారింది. 2024 లో రమేష్ తో పెళ్లి జరిగాక కూడా యుగంధర్ అనే యువకుడు అఫైర్ కంటిన్యూ చేస్తూ వచ్చిన హాసిని రెండు రోజుల క్రితం శాంతిపురం మండలంబోయినపల్లిలో ఉంటున్న తల్లి వద్దకు వచ్చింది. తరచూ పుట్టింటికి వచ్చి స్థానికంగా ఉన్న యుగంధర్ ను కలుస్తూ వస్తున్న హాసిని భర్త రమేష్ అడ్డు తొలగించుకోవాలని ప్లాన్ చేసింది. ఈ మేరకు రెండు రోజుల క్రితం భర్త బైక్ పై బోయినపల్లికి వచ్చిన హాసిని మల్లప్ప కొండకు వెళ్దామని చెప్పి తీసుకెళ్ళింది. భర్త రమేష్ బైక్ పై హాసిని ఏడాది కూతురుతో పయనమైంది. ఇంటి నుంచి మల్లేశ్వర స్వామి దర్శనం కోసం మల్లప్ప కొండకు బయలుదేరిన హాసిని బాయ్ ఫ్రెండ్ యుగంధర్ కు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తూ వచ్చింది. మల్లప్ప కొండకు ఎక్కుతూ మూడో టర్నింగ్ వద్ద ప్లాన్ చేసినట్టుగానే చేతిలో ఉన్న పర్స్ పడేసింది. పర్సు పడిపోయిందని బైక్ ను హాసిని ఆపేసింది. బైక్ ను అక్కడే వదిలి పడిపోయిన పర్సును తీసుకొచ్చేందుకు వెళ్లిన రమేష్ ను పట్టుకున్న యుగంధర్ బ్యాచ్ అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్ళింది. అనంతరం యుగంధర్ తో పాటు ఉన్న నలుగురు కలిసి రమేష్ ను హతమార్చి డెడ్ బాడీని అక్కడే వదిలేశారు. అనంతరం రమేష్ బైక్ పైనే యుగంధర్ హాసినిని పికప్ చేసుకొని రైల్వే స్టేషన్ కు చేరుకున్నారు. అక్కడి నుంచి ఇద్దరూ పరారయ్యారు. మల్లేశ్వర స్వామి దర్శనానికి వెళ్లిన రమేష్ ఫ్యామిలీ తిరిగి రాకపోవడంతో.. హాసిని తల్లి తన కూతురు కనిపించడం లేదంటూ నిన్న ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు రంగంలోకి దిగిన పోలీసులు సీసీ ఫుటేజీని పరిశీలించారు. సాంకేతిక ఆధారాలతో మిస్టరీని ఛేదించే పనిలో పడ్డారు. మొదట భర్తతో వెళ్లిన దృశ్యాలు.. ఆ తర్వాత భర్త బైక్ పై మరో ఇద్దరు యువకులతో కలిసి హాసిని వెళుతున్నట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం.. మల్లప్ప కొండ పరిసరాల్లో రమేష్ డెడ్ బాడీని కూడా గుర్తించారు. తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో ప్రియుడితో కలిసి భర్తను మర్డర్ చేసినట్టుగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. హాసినితో పాటు నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.. వివాహేతర సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని.. పక్కా ప్లాన్ తో హత్య చేసినట్లు పోలీసులు పేర్కొంటున్నారు. రమేష్ హత్యపై రాళ్ళ బూదుగురు పీఎస్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కుప్పం డిఎస్పీ పార్థసారథి చెప్తున్నారు.

## స్థానిక సమరానికి సై..!

మొదటి పేజీ తరువాయి...

తన వైపు నుంచి ముందస్తు చర్యలను ప్రారంభించింది. ఎన్నికల నిర్వహణకు అత్యంత కీలకమైన ఓటర్ల జాబితా సవరణ, వార్డుల పునర్విభజన ప్రక్రియను పురపాలక సంఘాల్లో ఇప్పటికే ప్రారంభించారు. ముఖ్యంగా 18 ఏళ్లు నిండిన యువ ఓటర్లందరికీ స్థానిక సంస్థల్లో ఓటు హక్కు కల్పించేలా కొత్త నిబంధనలను పరిశీలిస్తున్నారు. మరోవైపు, వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల ఖరారు కోసం ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ నివేదిక అందిన వెంటనే ఏపీఎస్ఈసీ ఎన్నికల తుది నోటిఫికేషన్‌ను విడుదల చేసే అవకాశం కనిపిస్తోంది. ఎన్నికల సంకేతాలు వెలువడటంతో అధికార తెలుగుదేశం పార్టీ క్షేత్రస్థాయిలో దూకుడు పెంచింది. జూలై 27వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా సుమారు 45 రోజుల పాటు భారీ ఎత్తున డోర్ టూ డోర్ కార్యక్రమాన్ని చేపట్టాలని పార్టీ అధిష్టానం శ్రేణులను ఆదేశించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది కాలంలోనే తీసుకున్న ప్రజాకర్షక నిర్ణయాలను, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే ఈ ప్రచారం ముఖ్య ఉద్దేశం. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే సమయానికి క్యాడర్‌ను పూర్తి స్థాయిలో సమరసన్నద్ధం చేయాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు ఆశించే అభ్యర్థుల్లో ఉత్సాహం నింపేందుకు, పార్టీ కోసం కష్టపడిన కీలక నేతలకు నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను కూడా త్వరగా ముగించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల ఫలితాలు ప్రభుత్వంపై ప్రజాభిప్రాయానికి అద్దం పడతాయని, అందువల్ల జనసేన, బీజేపీలతో కలిసి కూటమిగా ఉమ్మడి వ్యూహాలతో బరిలోకి దిగుతామని నేతలు చెబుతున్నారు. మొత్తానికి సెప్టెంబర్ మున్సిపల్ పోరు ఏపీ రాజకీయాల్లో మరో ఆసక్తికరమైన సమరానికి తెరలేపబోతోంది.

## 22న తల్లికి వందనం

మొదటి పేజీ తరువాయి...

విడుదలకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న ప్రతి విద్యార్థికి ఈ పథకం వర్తిస్తుంది. ఏడాదికి రూ.15,000 చొప్పున ప్రభుత్వం సాయం అందిస్తుంది. ఈ పథకం కింద అర్హులైన తల్లుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా రూ.13,000 జమ కానుండగా, పాఠశాలల మౌలిక వసతులు, నిర్వహణ కమిటీ కోసం రూ.2,000 కేటాయిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 67.47 లక్షల మంది విద్యార్థులకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరనుంది. మొత్తం 42.70 లక్షల మంది తల్లుల ఖాతాల్లో ఈ నగదు జమ కానుంది. ప్రభుత్వం ఈ పథకం అమలును పారదర్శకంగా చేపట్టేందుకు లబ్ధిదారుల వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేసింది. దీనిని రెండు విడతలుగా అమలు చేయనున్నారు. ఇప్పటికే పాఠశాలలు, కళాశాలల్లో కొనసాగుతున్న విద్యార్థుల తల్లుల బ్యాంక్ ఖాతాల వెరిఫికేషన్ పూర్తయింది. అర్హులైన వారి తుది జాబితాను ఈ నెల 22న స్థానిక గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తారు. అదే రోజు ముఖ్యమంత్రి చేతుల మీదుగా నేరుగా తల్లుల ఖాతాల్లోకి నగదు బదిలీ చేయబడుతుంది. ఈ విద్యాసంవత్సరంలో కొత్తగా ఒకటో తరగతిలో చేరిన పిల్లలు, అలాగే స్కూళ్లు మారి 9వ తరగతిలో చేరిన వారు, టెన్త్ పూర్తి చేసుకుని ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థుల వివరాల నమోదు ఇంకా కొనసాగుతోంది. వీరందరి డేటాను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హతను బట్టి ఆగస్టు 30వ తేదీ నాటికి వారి తల్లుల ఖాతాల్లో కూడా ఆర్థికసాయాన్ని జమ చేయనున్నారు. కొత్తగా చేరిన వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని విద్యాశాఖ స్పష్టం చేసింది. ఈ నెల 22న నిధులు విడుదలవుతున్న నేపథ్యంలో తల్లులందరూ తమ బ్యాంకు ఖాతాలు రన్నింగ్‌లో ఉండేలా చూసుకోవాలని, కేవైసీ సమస్యలు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని అధికారులు సూచించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ భారీ నిర్ణయంపై విద్యార్థుల తల్లిదండ్రుల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఆంధ్రప్రదేశ్.. మీకు సారీ చెబుతోంది

మొదటి పేజీ తరువాయి...

మాధ్యమాల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌కు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేష్ భిన్నంగా స్పందించారు. నాలుగు దశాబ్దాలకు పైగా, ఆంధ్రప్రదేశ్ సాధించిన అత్యంత గొప్ప పారిశ్రామిక విజయగాథలలో అమరరాజా కేవలం ఒక విజయగాథ మాత్రమే కాదు, అంతకంటే ఎంతో ఎక్కువ. ఇది ప్రపంచ స్థాయి తయారీ రంగాన్ని సృష్టించింది, వేలాది మందికి ఉద్యోగాలను కల్పించింది, మరియు చిత్తూరుతో పాటు ఆంధ్రప్రదేశ్ పేరును భారతదేశం మరియు ప్రపంచవ్యాప్తంగా సగర్వంగా చాటిచెప్పిందని గుర్తుచేసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో మీ సంస్థ ఎదుర్కొన్న వేధింపులు అసలు జరిగకుండా ఉండాల్సింది. తన సొంత రాష్ట్రంలో పరిశ్రమను నిర్మించాలని ఎంచుకున్న ఒక పారిశ్రామికవేత్తకు ప్రోత్సాహం లభించాలి కానీ, బెదిరింపులు కాదు. ఆంధ్రప్రదేశ్‌లో పుట్టిన ఒక సంస్థ తన తదుపరి వృద్ధి ప్రస్థానం కోసం మన సరిహద్దులు దాటి వేరే రాష్ట్రం వైపు చూడాల్సి రావడం నన్ను ఎంతగానో కలచివేస్తోందన్నారు. మనం మళ్లీ నమ్మకాన్ని పునరుద్ధరిస్తున్న ఈ తరుణంలో ఆంధ్రప్రదేశ్ మరోసారి పరిశ్రమల స్థాపనకు, పెట్టుబడులకు సిద్ధంగా ఉంది. అమరరాజా ప్రస్థానం ఎక్కడైతే మొదలైందో, అదే రాష్ట్రంలో దాని అత్యంత అద్భుతమైన కొత్త అధ్యాయాలు సృష్టిస్తాయని నమ్ముతున్నట్లుగా తెలిపారు. మా తలుపులు, మా హృదయాలు ఎల్లప్పుడూ మీ కోసం తెరిచే ఉ




ంటాయని ఆహ్వానించారు. అమరరాజా సంస్థకు ఈ స్థాయి ఎదుగుదలను ఇచ్చిన ఆంధ్రప్రదేశ్ గడ్డను దాటి పొరుగు రాష్ట్రంలో ఇంత భారీ పెట్టుబడి పెట్టాల్సి రావడం వెనుక గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ కక్షసాధింపు రాజకీయాలే ప్రధాన కారణం. గత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్ల కాలంలో, అప్పటి గుంటూరు టీడీపీ ఎంపీగా ఉన్న గల్లా జయదేవ్‌ను . ఆయన కుటుంబ వ్యాపారాలను లక్ష్యంగా చేసుకుని తీవ్ర వేధింపులకు గురిచేశారనే ఆరోపణలు ఉన్నాయి. కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల పేరుతో చిత్తూరులోని అమరరాజా ప్లాంట్లకు మూసివేత నోటీసులు ఇవ్వడం, విద్యుత్ కనెక్షన్లు కట్ చేయడం వంటి ఒత్తిళ్లతో పరిశ్రమను ఊపిరి ఆడకుండా చేశారు. సొంత రాష్ట్రంలో వ్యాపారాన్ని రాజకీయ కారణాలతో దెబ్బతీసే ప్రయత్నం చేయడం, తీవ్రమైన బెదిరింపులు, వేధింపులు ఎదురుకావడంతో అమరరాజా యాజమాన్యం తీవ్ర అభద్రతాభావానికి లోనైంది. భవిష్యత్ విస్తరణ ప్రాజెక్టులను ఏపీలో పెడితే మరింత నష్టం వాటిల్లుతుందని భావించి, అప్పట్లో పారిశ్రామికవేత్తలను ఆకర్షిస్తున్న తెలంగాణ వైపు వారు మొగ్గు చూపారు. నాటి తెలంగాణ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ చొరవతో రూ. 9,500 కోట్ల విలువైన దేశంలోనే అతిపెద్ద లిథియం-అయాన్ గిగాఫ్యాక్టరీ ప్రాజెక్టును మహబూబ్‌నగర్‌కు తరలించారు. ఏపీలో రావలసిన ఈ భారీ పెట్టుబడి, తద్వారా లభించాల్సిన వేలాది ఉద్యోగాలు జగన్ ప్రభుత్వ కక్షపూరిత వైఖరి వల్లే పొరుగు రాష్ట్రానికి తరలిపోయాయని నాడు విపక్షాలు తీవ్రస్థాయిలో మండిపడ్డాయి. పారిశ్రామిక ప్రగతికి రాజకీయాలు ఎలా శాపంగా మారుతాయో చెప్పడానికి అమరరాజా ఉదంతం ఒక పాఠం లాంటిది. ఒక నాయకుడి వ్యక్తిగత అహానికి, కక్షసాధింపు చర్యలకు వ్యవస్థలు బలైతే రాష్ట్రాలు ఎంతటి ఆర్థిక నష్టాన్ని చవిచూస్తాయో ఈ తరలిపోయిన ప్రాజెక్ట్ స్పష్టం చేస్తోంది. ఏదేమైనా, తెలంగాణలో ప్లాంట్ ప్రారంభోత్సవం సందర్భంగా గల్లా జయదేవ్ చేసిన ట్వీట్.. ఏపీలో గత పాలకుల వైఫల్యాలను, ప్రస్తుత కూటమి ప్రభుత్వ పారిశ్రామిక పునరుద్ధరణ ప్రయత్నాలను జాతీయ స్థాయిలో మరోసారి చర్చకు పెట్టేలా చేసింది.

## రూ. 10,120 కోట్లతో 'తల్లికి వందనం' పథకానికి గ్రీన్ సిగ్నల్..

**టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎం సుబ్బయ్య**

**శ్రీకాళహస్తి, జులై 16,జయజయహే.**



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విద్యా రంగాన్ని బలోపేతం చేస్తూ, అత్యంత ప్రతిష్టాత్మకమైన 'తల్లికి వందనం' పథకం (2026-27) అమలుకు రూ. 10,120.78 కోట్ల భారీ బడ్జెట్తో పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1 నుండి 12వ తరగతి వరకు చదువుతున్న 67,47,190 మంది విద్యార్థులకు, అలాగే 42,70,802 మంది అర్హులైన తల్లులకు లబ్ధి చేకూరనుంది. పిల్లల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15,000 చొప్పున ఆర్థిక సాయం అందుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బయ్య తెలిపారు. పాఠశాలల నిర్వహణ, పరిశుభ్రత కోసం రు.2,000 మినహాయించి, మిగిలిన మొత్తాన్ని తల్లుల ఖాతాల్లో జమ చేస్తారు. జులై 22న మొదటి విడత నగదు పంపిణీ జరగనుండగా, ఆగస్టు 30 కల్లా మిగిలిన ప్రక్రియ అంతా పారదర్శకంగా పూర్తి చేయనున్నారని ఆయన తెలిపారు.



## పల్లె పల్లెలో ప్రజలకు అవగాహన సదస్సు.

**బిఎస్ పి పార్టీ పోతురాజు**

**అరకులోయ: జయ జయహే**

బహుజన సమాజ్ పార్టీ అల్లూరి జిల్లా అధ్యక్షులు ఎస్ లక్ష్మి నారాయణ పాడేరు అసెంబ్లీ అధ్యక్షులు సుర్ల పోతురాజు . పల్లె పల్లెకు బిఎస్ పి పార్టీ కార్యక్రమం అరకు వేలి మండలం పద్మాపురం గ్రామంలో నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ ప్రజలతో మాట్లాడుతూ. త్రాగినీటి డ్రైనేజీ కాలువ లు లేకపోవడంతో మురికి నీరు నిల్వ ఉండిపోవడంతో. వర్షం వస్తే ఇళ్ల దగ్గర మురికి నీళ్ళు వస్తున్నాయని దీని ద్వారా ప్రజలు రోగుల భారీ నా పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యలు వల్ల గ్రామానికి ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని. ఎన్ని సార్లు అధికారులకు నాయకులకు చెప్పిన కష్టాలు తీరలేదని. కాబట్టి ఈ సమస్యలు పరిష్కారం చేయకపోతే నిరసన కార్యక్రమం చేపడతామని బిఎస్పి పార్టీ పోతురాజు డిమాండ్ చేశారు.



## శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్న ప్రముఖ సినీ సంగీత దర్శకులు మణిశర్మ.

**శ్రీకాళహస్తి.జులై 16,జయ జయహే.**

ప్రముఖ సినీ సంగీత దర్శకులు, స్వరబ్రహ్మ మణిశర్మ గురువారం శ్రీకాళహస్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి అమ్మవార్లను భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.దర్శనానంతరం ఆలయ వేద పండితులు వేదాశీర్వచనం అందించగా, దేవస్థానం తరపున స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దేవస్థాన ప్రోటోకాల్ ఏఈఓ లోకేష్ బాబు, దేవస్థాన ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ నాగభూషణం, ఏపీఆర్వో రవి తదితరులు పాల్గొన్నారు.



## శివుని దర్శించుకున్న గన్నవరం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకటరావు.

**శ్రీకాళహస్తి, జులై 16,జయ జయహే**

గన్నవరం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకటరావుకుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి వారిని గురువారం దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ప్రోటోకాల్ ఏఈఓ లోకేష్ బాబు గౌరవ అతిథులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం అందించగా, ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదములు, శేషవస్త్రం, జ్ఞాపికను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.


## 'పోలవరం--మోడీ వరం' నినాదాలతో పోలవరం ప్రాజెక్టుకు బీజేపీ ప్రజాప్రతినిధుల సందర్శన

**రాజమహేంద్రవరం, జూలై 16, జయజయహే:**

పోలవరం బహుళార్ధ సాధక ప్రాజెక్టు నిర్మాణ పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రజాప్రతినిధులతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు గురువారం రాజమహేంద్రవరం నుంచి పోలవరం వరకు భారీ సందర్శన యాత్ర నిర్వహించారు. "పోలవరం--మోడీ వరం" నినాదాలతో సాగిన ఈ యాత్రలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.యాత్ర ప్రారంభానికి ముందు రాజమహేంద్రవరంలోని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర మంత్రులు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనుల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలించడం,




ప్రాజెక్టుకు సంబంధించిన కీలక అంశాలపై అవగాహన పెంపొందించుకోవడం, ప్రాజెక్టు పరిసర ప్రాంతాల పరిస్థితులను తెలుసుకోవడమే యాత్ర ప్రధాన ఉద్దేశమని తెలిపారు.రాజమహేంద్రవరం నుంచి గోదావరి ఎడమ గట్టును ఆనుకుని పురుషోత్తపట్నం మీదుగా పోలవరం ప్రాజెక్టు ప్రాంతానికి చేరుకున్న ప్రజాప్రతినిధుల బృందం ఎలిఫెంట్ కొండ, రామదుర్గం, రామవరం, టన్నెల్ ప్రాంతాలతో పాటు లాంచీల రాకపోకలు జరిగే ప్రాంతాలను సందర్శించి పరిస్థితులను పరిశీలించింది. ప్రాజెక్టు నిర్మాణ పనులు, భవిష్యత్ నిర్వహణ, వివిధ శాఖల మధ్య సమన్వయం, ప్రాజెక్టు పరిసర ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించారు.క్షేత్రస్థాయిలో పరిశీలించిన అంశాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు చేపట్టేలా కృషి చేస్తామని నాయకులు తెలిపారు. అనంతరం మార్గమధ్యంలోని పలు ప్రాంతాలను సందర్శిస్తూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించారు.ఈ యాత్రలో కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.




## ఈడీ కస్టడీకి లిక్కర్ స్కామ్ నిందితులు

**(హైదరాబాద్ - జయజయహే)**

మద్యం రవాణా స్కాం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం రవాణా టెండర్ల కేటాయింపుల్లో భారీ అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మనీలాండరింగ్ కోణంలో ముమ్మర దర్యాప్తు చేస్తోంది. టెండర్ల నిబంధనలను ఉద్దేశపూర్వకంగా మార్చడం వల్ల ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ. 195 కోట్ల మేర భారీ నష్టం వాటిల్లిందని ఈడీ ప్రాథమికంగా ఆరోపిస్తోంది. ఈ క్రమంలోనే నిధుల మళ్లింపు, అక్రమ ఆర్థిక లావాదేవీల గుట్టు రట్టు చేసేందుకు అధికారులు రంగంలోకి దిగారు.

ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న ఏపీఎస్‌బీసీఎల్ మాజీ ఎండీ వాసుదేవ రెడ్డి, రాజ్ కసిరెడ్డిలతో పాటు మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్‌కు నాంపల్లి కోర్టు మూడు రోజుల ఈడీ కస్టడీని మంజూరు చేసింది. కోర్టు ఆదేశాల అనంతరం చర్లపల్లి జైలులో రిమాండ్‌లో ఉన్న ముగ్గురు నిందితులను ఈడీ అధికారులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. నిందితులకు చట్టప్రకారం ముందుగా వైద్య పరీక్షలు నిర్వహించిన తర్వాత, తదుపరి విచారణ నిమిత్తం వారిని ఈడీ కార్యాలయానికి తరలించారు. కోర్టు అనుమతించిన ఈ మూడు రోజుల కస్టడీలో భాగంగా నిందితులను విడివిడిగా, అవసరమైతే ఎదురెదురుగా కూర్చోబెట్టి అధికారులు ప్రశ్నించనున్నారు. టెండర్ల నిబంధనల మార్పులు, నిధుల బదిలీలు, ఆర్థిక లావాదేవీలతో పాటు ఈ కుంభకోణంలో మరికొందరు అధికారుల పాత్రపై ఈడీ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇప్పటికే పలువురి నుంచి వాంగ్మూలాలు సేకరించిన అధికారులు, ఈ కస్టడీ విచారణ ద్వారా మరిన్ని కీలక ఆధారాలు రాబట్టవచ్చని భావిస్తున్నారు. విచారణ అనంతరం లభించే సమాచారం ఆధారంగా కేసులో తదుపరి చర్యలు వేగవంతం కానున్నాయి.



## నెల రోజుల్లో భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభం

**నిర్మాణ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి**

**డీజీసీఏ అనుమతులు కూడా వచ్చాయి**

**ప్రధాని మోడీ చేతుల మీదుగా ప్రారంభిస్తాం**

**కేంద్ర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు**

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

నెల రోజుల్లో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఉడాన్ 2.0 పథకం అమలు తీరుతెన్నులపై వర్క్‌షాప్‌లో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులు పూర్తయ్యాయని, డీజీసీఏ అనుమతులు వచ్చాయని చెప్పారు. ఉత్తరాంధ్రతో పాటు ఏపీకి ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఈ ప్రాజెక్టును ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభిస్తేనే న్యాయం జరిగినట్లని అభిప్రాయపడ్డారు. ప్రధాని పర్యటన తేదీ కోసం వేచి చూస్తున్నామని నెలరోజుల్లో విమానాశ్రయ కార్యకలాపాలు ప్రారంభం అవుతాయని రామ్మోహన్ నాయుడు స్పష్టంచేశారు. ఉత్తరాంధ్రుల ఎన్నో ఏళ్ల కల భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం. సుమారు రూ.4750 కోట్లతో 2203 ఎకరాలు ఎకరాల్లో దీనిని నిర్మించారు. బోయింగ్ విమానాలు ఎయిర్ బస్, బోయింగ్ విమానాలు సులభంగా ల్యాండయ్యేలా 3,800 మీటర్ల పొడవు, 45 మీటర్ల వెడల్పున కేట్ ఐ -1 రన్‌వే నిర్మించారు. ఐదు వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో 25,000ల టన్నుల సరకు రవాణా టెర్మినల్ నిర్మాణం చేపట్టారని వివరించారు.

## చిత్తూరు మహిళా పోలీస్ స్టేషన్ డి.ఎస్.పి.గా బాధ్యతలు చేపట్టిన బి. శ్రీనివాసరావు.

**చిత్తూరు, జులై 15, జయ జయహే.**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఇన్‌స్పెక్టర్లకు డి.ఎస్.పి.లుగా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా, చిత్తూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బి. శ్రీనివాసరావు డి.ఎస్.పి.గా పదోన్నతి పొందారు.పదోన్నతి అనంతరం రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం (డి.జి.పి. కార్యాలయం)లో రిపోర్ట్ చేసిన బి. శ్రీనివాసరావు కి చిత్తూరు మహిళా పోలీస్ స్టేషన్ డి.ఎస్.పి.గా అటాచ్మెంట్ పోస్టింగ్ కల్పించగా, గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడిని మర్యాదపూర్వకంగా కలిశారు.

# కనీస వేతనాల కోసం చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి

**సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎస్ బి పోతురాజు.**

**దుంబ్రిగూడ: జయ జయహే.**



రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, డైలీ వేజ్ ఉద్యోగులకు కార్మికులకు కనీస వేతనాలు రూ 26 వేలు చెల్లించాలని సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డిమాండ్ చేశారు. పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో పనిచేస్తున్న కార్మికులతో కనీస వేతనాలు చెల్లించాలని ఈనెల 30,31 న నిర్వహించే చలో కలెక్టరేట్ విజయవంతం చేయాలని కోరుతూ గురువారం వాల్ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ,కార్మికులకు అతి తక్కువ వేతనాలు చెల్లించి ప్రభుత్వం వెట్టి చాకిరి చేయించుకుంటుందని విమర్శించారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా వీరికి కనీస వేతనం రూ 26 వేలు చెల్లించాలన్నారు. అనేక ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చి కార్మికుల వేతనాలపై సామాజిక భద్రతపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దాడి చేస్తున్నాయని విమర్శించారు. కనీస వేతనాలు కోసం నిర్వహించే చలో కలెక్టరేట్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో కాంట్రాక్ట్ ,ఔట్సోర్సింగ్, డైలీ వెజ్ ఉద్యోగులు కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకుడు ఎస్ గురుమిసింగ్, చాపరాయి జలపాతం కార్మికులు ఎస్ రాజ్ కుమార్, కే సురేంద్ర , ఏం సూరి తదితరులు పాల్గొన్నారు.



# ఒక్క మాట.. పెద్ద భరోసా..

**రాజమహేంద్రవరం: జయ జయహే:**

జూలై16:కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అకాల మరణం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబ సభ్యులను జనసేన పార్టీ నేతలు పరామర్శించారు. వారి నివాసానికి వెళ్ళిన జనసేన రాజమండ్రి సిటీ ఇన్చార్జ్ అనుశ్రీ సత్యనారాయణ,ఎపి టూరిజం డెవలప్మెంట్ డైరెక్టర్ గంటా స్వరూప దేవి.. ముద్రగడ కుమార్తె బార్లపూడి క్రాంతిని ఓదార్చారు. అనుశ్రీ సత్యనారాయణ:"మాట్లాడుతూముద్రగడ పద్మనాభం లేని లోటు భర్తీ చేయలేనిది. సామాజిక చైతన్యంలో ఆయనది ప్రత్యేక ముద్ర. ఈ క్లిష్ట సమయంలో జనసేన పార్టీ, క్రాంతి వారి కుటుంబానికి అండగా ఉంటుంది. ఏ అవసరం వచ్చినా మేము తోడుగా ఉంటాం." గంటా స్వరూప దేవి మాట్లాడుతూ "ముద్రగడ ఒక ధైర్యవంతుడైన నాయకుడు. ఆయన ఆశయాలు, పోరాట పటిమ మనందరికీ స్ఫూర్తిదాయకం. వారి కుటుంబం మనోధైర్యాన్ని కోల్పోకూడదు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, ఈ దుఃఖ సమయంలో మీ కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము."ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ చైర్మన్లు, డైరెక్టర్లు, జనసేన నాయకులు, వీర మహిళలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ముద్రగడ చిత్రపటానికి నివాళులర్పించారు.

# ఆర్టీసీ ప్రయాణికుల సదుపాలపై సర్వే

**నర్సీపట్నం ( జయ జయహే)**



ఆర్టీసీ డిపోలో ప్రయాణికులకు అందుతున్న సౌకర్యార్థం లపై ఇంచార్జ్ డిపో మేనేజర్ డీ. త్రిమూర్తులు ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. ఆర్టిసి ప్రాంగణంలో ఉన్న మరుగుదొడ్లు , మంచినీటి సదుపాయం , సిబ్బంది ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తున్న తీరుపై ప్రయాణికుల వద్దనుండి అభిప్రాయాలు సేకరించారు. ఆర్టీసీ ప్రయాణీకులకు మెరుగైన సేవలు అందించడంతోపాటు ప్రయాణికుల సంతృప్తి స్థాయిని తెలుసుకోవడమే ఈ సర్వే ఉదేశమని ఇంచార్జ్ డిపో మేనేజర్ త్రిమూర్తులు తెలిపారు. మెరుగైన ప్రయాణ సేవలను అందించేందుకు ఈ సర్వే ఫలితాలు ఎంతగానో దోహదపడతాయని తెలియజేశారు. ఆర్టీసీ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని , ప్రయాణీకులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే ప్రధాన లక్ష్యమని , ప్రయాణికులు ఆర్టీసీ సదుపాయాలను వినియోగించుకోవాలని కోరారు.



# డ్రైనేజీ వైఫల్యంతో రోడ్డంతా మురుగు.. దుర్వాసనతో అవస్థలు..

**కొయ్యూరు :(జయ జయహే )న్యూస్ జులై 17,**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం బాలారం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నుంచి మురుగు నీరు ప్రధాన రహదారిపైకి ప్రవహిస్తుండటంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ఆ మార్గంలో నిత్యం ప్రయాణించే ప్రజలు, విద్యార్థులు, వాహనదారులు, సమీపంలో నివసించే కుటుంబాలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నాయి.స్థానిక గ్రామస్తుల కథనం ప్రకారం పాఠశాలకు సంబంధించిన డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగు నీటిని సమీపంలోని కాలువకు మళ్లించకుండా నేరుగా రహదారిపైకి వదిలేస్తున్నారు. ఫలితంగా రోడ్డుపై మురుగు నీరు నిల్వ ఉండి దుర్గంధం వ్యాపిస్తోంది. ఈ మార్గంలో వెళ్లాలంటే ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని, మురుగు నీటితో దోమలు, ఈగలు పెరిగి అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం కూడా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాన రహదారిపై మురుగు నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడటమే కాకుండా పాఠశాల పరిసరాల పరిశుభ్రత కూడా దెబ్బతింటోందని పేర్కొన్నారు.ఈ సమస్యను సంబంధిత అధికారులు తక్షణమే పరిశీలించి, డ్రైనేజీ వ్యవస్థను సక్రమంగా ఏర్పాటు చేసి మురుగు నీటిని కాలువకు మళ్లించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని శాశ్వత పరిష్కారం చూపాలని వారు విజ్ఞప్తి చేశారు.

# భజన ఆపి నిజమైన టీడీపీ నాయకులుగా ఉండండి

**కొయ్యూరులో లోవదేవి నిరసన..**

**కొయ్యురు : (జయ జయహే )న్యూస్ జులై 17,**



అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం చీడిపాలెం గ్రామానికి చెందిన కాకురు లోవదేవి, సుధారాణి న్యాయం కోసం కొయ్యూరు ఎంపీడీఓ ఆఫీస్ ముందు రెండో రోజు నిరసన చేశారు. లోవదేవి మాట్లాడుతూ వీఆర్పీగా ఉన్నప్పుడు తప్పు చేశానని అంటున్నారు. నిరూపించమంటే ఎవరూ నిరూపించలేదు. నాది ఒకటే వర్గం, అది టీడీపీ కానీ కొందరు పార్టీ పేరుతో గిడ్డి ఈశ్వరి వర్గం అంటూ విడిపోయారు. అధిష్టానాన్ని తప్పుడు సమాచారం ఇచ్చి, భజన చేసేవాళ్లకు పదవులు ఇస్తున్నారు. భజన ఆపి నిజమైన టీడీపీ కార్యకర్తలుగా ఉంటే అందరికీ మంచిది అని అన్నారు. మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పై చేసిన ఆరోపణలు నిజమేనని, తమకు జరిగిన అన్యాయంపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నిజం గెలిచే వరకు మేము పోరాడతాం అని స్పష్టం చేశారు.ఈ నిరసనతో కొయ్యూరులో రాజకీయ చర్చ వేడిగా మారింది.



# "ముద్రగడ ఆశయమే ముందడుగు!"

**రాజమహేంద్రవరం: జయ జయహే :జూలై 16:**

కడియం కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి దివంగత ముద్రగడపద్మనాభం సంస్మరణ సభ టివిసిచారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ముద్రగడవీరాభిమాని తాడాల విష్ణు చక్రవర్తిఆధ్వర్యంలో గురువారం కడియం రంగా సెంటర్‌లో ఘనంగాజరిగింది.జోహార్ ముద్రగడ అమర్ రహే ముద్రగడ అంటూనినాదాలతో రంగా సెంటర్ మార్మోగింది.ఈకార్యక్రమానికిముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర వైసిపినేత గిరిజాల బాబు మాట్లాడుతూ, "ముద్రగడ పద్మనాభం ఎమ్మెల్యేగా, మంత్రిగా విశేష సేవలు అందించడమే కాకుండా, కాపు జాతి ఉద్ధరణ కోసం తన రాజకీయ జీవితాన్ని పణంగా పెట్టారు. కాపు రిజర్వేషన్ల కోసం ఆయన చేపట్టిన అకుంఠిత దీక్ష, ఉద్యమాలు నేటి తరానికిస్ఫూర్తిదాయకం. ఆయన మృతి కాపు జాతికి తీరని లోటు" అని పేర్కొన్నారు.పార్టీలకు అతీతంగా కాపు నాయకులంతా ఏకమై రిజర్వేషన్లుసాధించుకున్నప్పుడే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అవుతుందని ఆయన పిలుపునిచ్చారు.టివిసి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముద్రగడవీరాభిమాని తాడాల విష్ణు చక్రవర్తి మాట్లాడుతూ, "నీతి, నిజాయితీకిమారుపేరుగాముక్కుసూటి మనిషిగా జీవించిన ముద్రగడ పద్మనాభం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. అప్పుడే ఆయన ఆత్మకు నిజమైన శాంతి చేకూరుతుంది" అనిఅన్నారు.అనంతరం ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగానివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాల మౌనం పాటించారు.ఈ కార్యక్రమంలో కాపు నాయకులు ముద్దాల అను, తోకల శ్రీనివాసరావు, బోడపాటిసత్యనారాయణ,వెలుగుబంటి అచ్యుత రామ్, సాపిరెడ్డి,సూరిబాబుచిలుకూరు రామకృష్ణ, దొడ్డా బుజ్జి,ఆకుల సుధాకర్, సాపిరెడ్డి కామేష్, శెట్టి సత్యనారాయణ, ఆరేటి వెంకట్రావ్, తెలగరెడ్డి సూరిబాబు, దేవరపల్లి సరిత,పసల నాయుడు, దేవి, దాసరి శ్రీనివాస్, సలాది ప్రసాద్, జ్యోతుల అర్జున్, గణేశుల చక్రవర్తి, వీరబాబు, తోరటి శ్రీను,రంగా కమిటీ మండల అధ్యక్షుడు నాగవరపు బాబి యూత్, గాద సాయి, తదితరులు పాల్గొన్నారు.



# ప్రెస్ క్లబ్ అభివృద్ధికి పురందేశ్వరి భరోసా

**రాజమహేంద్రవరం: జయ జయహే : జూలై 16**

:నగర ప్రెస్ క్లబ్ నూతన పాలకవర్గం బుధవారం ఎంపి దగ్గుబాటి పురందేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ, రాజమండ్రి ప్రతిష్టకు అనుగుణంగా ప్రెస్ క్లబ్‌ను తీర్చిదిద్దేందుకు తనవంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రెస్ క్లబ్ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలకవర్గం ఐక్యంగా ముందుకు సాగాలని ఆమె సూచించారు. అనంతరం రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబును కూడా పాలకవర్గం కలిసి అభివృద్ధికి సహకరించాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మోతా బాల విజయసారథి, జనరల్ సెక్రెటరీ వేణుగోపాలస్వామి (గోపి), ఉపాధ్యక్షులు గంగాధర్, దుర్గ, సంయుక్త కార్యదర్శులు కృపానందం, ప్రసాద్, సభ్యులు సత్యనారాయణ, మధు, అకుల ఈశ్వర్, పాలపర్తి శ్రీనివాస్, చంటి పాల్గొన్నారు.




# ముద్రగడకు వైసిపి నేతలు నివాళి

**రాజమహేంద్రవరం: జయ జయహే : జూలై 16**

కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మృతి వైసిపికి తీరని లోటని రాజమహేంద్రవరం మాజీ ఎంపి సిటీ ఇన్‌చార్జ్ మార్గాని భరత్ రామ్ పేర్కొన్నారు. విఎల్ పురం మార్గాని ఎస్టేట్స్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన చిత్రపటానికి భరత్ రామ్, బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, పార్టీ శ్రేణులు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా భరత్ రామ్ మాట్లాడుతూ.. పార్టీకి చిత్తశుద్ధితో పనిచేసే నాయకులకు జగన్మోహన్ రెడ్డి ఇచ్చే ప్రాధాన్యతకు ముద్రగడ అంత్యక్రియల్లో ఆయన స్వయంగాపాల్గొనడమే నిదర్శనమని అన్నారు. కూటమి ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా ఉండాల్సిన అంశాల్లోనూ కక్షపూరిత రాజకీయాలు చేస్తోందని విమర్శించారు.అనంతరం పార్టీ శ్రేణులతో జరిగిన సమావేశంలో భరత్ రామ్ మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో రాజమండ్రి సిటీని గెలిపించుకోవాలని జగన్ స్పష్టమైన దిశానిర్దేశం చేశారని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో సిటీ ఇప్పటికే రెండు జిల్లాల్లో 4వ స్థానంలో ఉందని, గడువు పొడిగించిన నేపథ్యంలో దీన్ని ప్రథమ స్థానానికి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. 8,300 కోర్ కమిటీ ఎంపిక చేసిన కుటుంబాలకు ప్రాధాన్యత ఇస్తూ, అంకితభావంతో పనిచేసే కార్యకర్తలకు భవిష్యత్తులో పెద్దపీట వేస్తామని భరోసానిచ్చారు.

# సంపద సృష్టి పేరుతో సంపద అమ్మకం హర్ష కుమార్'



**రాజమహేంద్రవరం, జయ జయహే :జూలై 16:**

ప్రభుత్వ భూములను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన సొంత ఆస్తిలా తనకు కావాల్సిన వారికి కట్టబెడుతున్నారని మాజీ ఎంపి జివి హర్షకుమార్ ఆరోపించారు. గురువారం రాజమండ్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, యోగా డే సందర్భంగా రాందేవ్ బాబాకు 70 ఎకరాల భూమి, రూ. 130 కోట్ల సబ్సిడీ ఇవ్వడంపై మండిపడ్డారు.ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు దాటినా ఒక్క ఉద్యోగం కల్పించలేదని, కేవలం కంపెనీలకు భూములు, సబ్సిడీలు ఇస్తూ సంపదను అమ్మేస్తున్నారని విమర్శించారు.కాపు సామాజిక వర్గం కోసం రక్తం ధారపోసిన మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ, ఆగస్టు 10న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు ప్రకటించారు.జిల్లా కలెక్టర్లు గ్రామీణ ప్రాంతాల్లో కనీస మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని సూచించారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి






## అరకు నియోజకవర్గ కేడర్ సమావేశంలో 'అల్లూరి' జిల్లా అధ్యక్షులు మఠం శాంత కుమారి

**అరకు, జూలై 16, జయ జయహే**

త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని వాటిలో శతశాతం విజయం సాధించేలా క్యాడర్ సన్నద్ధం కావాలని భారతీయ జనతా పార్టీ అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షులు మఠం శాంతకుమారి పేర్కొన్నారు. అరకు నియోజకవర్గ కేడర్ సమావేశం గురువారం డుంబ్రిగూడ మండలంలో జరిగింది. ఈ కార్యక్రమంలో కేడర్ కు స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. రెండు రోజుల క్రితమే సీఎం చంద్రబాబు స్థానిక ఎన్నికలు నిర్వహణపై ప్రకటన విడుదల చేశారన్నారు. తొలుత మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు, తర్వాత జిల్లా - మండల పరిషత్తు, గ్రామపంచాయతీ ఎన్నికలు ఉండబోతున్నాయని ఆయన తెలిపారని శాంత కుమారి పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించినప్పుడే మనం నిజమైన నాయకులుగా ఎదుగుతామని ఓట్ బ్యాంకు కూడా పెరుగుతుందని చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లా బిజెపి ఇన్చార్జ్ పుట్టా గంగయ్య మాట్లాడుతూ ఈ ఎన్నికలను పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుందని గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేయాలన్నారు. అభివృద్ధి సంక్షేమం అందిస్తున్నప్పుడు కచ్చితంగా ప్రజలు భారతీయ జనతా పార్టీకి చెరువుగా ఉంటారని తెలిపారు మనం చేసే పనిని చెప్పడం ద్వారా పది మందికి తెలుస్తుందని ఆ విషయంలో వెనకబడి ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి డొంబు నాయుడు, మైనార్టీ మోర్చ రాష్ట్ర కార్యదర్శి పెనుమాక రవికుమార్, విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు ఎంపీటీసీ దేవదాసు, బిజెపి డుంబ్రిగూడ మండల ఇన్చార్జి స్వామి రామచంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు తాంగుల సత్యవతి, చినతల్లి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షులు కెజియరాణి, మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు స్వాతిరాణి, 'సర్' అరకు అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ వంతాల రామచంద్ర, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు గోపాల పాత్రుడు, ఎస్టీ మోర్చ జిల్లా అధ్యక్షులు లకే అబ్బాయి దొర, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు పాపిడి రాజు, సీనియర్ నాయకులు లకే భాస్కర్, మహిళా మోర్చా టీం కళావతి, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు జన్నీ సత్తిబాబు, ఆరు మండలాల అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## శ్రీ జగన్నాథ స్వామి రథయాత్రలో పాల్గొన్న కొణతాల

**అనకాపల్లి జయ జయహే**

దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ శ్రీ జగన్నాథ స్వామి రథయాత్ర ను స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ స్వామివారి రథా నీ లాగే స్వామివారి రథ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కు మేళతాళాలతో పండితులు వేదమంత్రోత్సవాల మధ్య ఘనంగా స్వాగతం పలికి స్వామివారి వద్దకు ఘనంగా తోడుకొని వెళ్లి స్వామివారి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయం లోంచి స్వామివారు జగన్నాధ స్వామి సుభద్ర బలబద్ర విగ్రహాలనీ మేళ తాళాలతో ఆలయం చుట్టూ ఊరేగింపుగా తోడుకొని రథంలోకి చేర్చడం జరిగింది. రథం ముందు కొబ్బరికాయలు కొట్టి స్వామివారి రధాని ఎమ్మెల్యే రామకృష్ణ లాగి ఊరేగింపు ఉత్సవం ప్రారంభం చేయడం జరిగింది. భక్తుల కోలాహలం మధ్య రథం ఊరేగింపుగా పురవీధుల గుండా జై జగన్నాధ జై జగన్నాథ జై నారాయణ భక్తులు స్వామివారి నామస్మరాన్ని ఎలుగెత్తి స్మరించారు ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు ఆలయ చైర్మన్ దాడి బుజ్జి, ప్రజా ప్రతినిధులు ఆలయ కమిటీ సభ్యులు అధికారులు జనసేన తెలుగుదేశం బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



## జీవీఎంసీ అధికారులతో కొణతాల సమీక్ష సమావేశం

**అనకాపల్లి జయ జయహే**

స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ జీవి ఎం సి అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో అనకాపల్లి పట్టణంలో రహదారులు కాలువలు ఓపెన్ జిమ్స్ పార్కులు వీధిలైట్లు ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. ఇప్పటికే చేపట్టిన పనులు గురించి ఇంకా పూర్తి చేయాల్సిన పనుల గురించి అలాగే చేపట్టాల్సిన కొత్త అభివృద్ధి పనులపై జీవీఎంసీ అధికారులతో సవివరంగా అండ్ చర్చించాలి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు పలు అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఈ సమీక్ష సమావేశంలో జీవీఎంసీ డిప్యూటీ ఇంజనీర్, డి ఈ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



## సిక్కోలు స్వచ్ఛంద సేవ సమితి ఆర్థికసాయం

**గార (జయ జయహే)**

గార మండలం, సతివాడ గ్రామానికి చెందిన పుట్ట.జోగులు కుటుంబానికి, సిక్కోలు స్వచ్ఛంద సేవ సమితి రూ.10 వేల ఆర్థికసాయం అందించింది. ఈ సందర్భంగా సిక్కోలు స్వచ్ఛంద సేవ సమితి సభ్యులు హరకేసం మాట్లాడుతూ ఇంటికి పెద్దదిక్కు అయిన పుట్ట.జోగులు గత కొంతకాలంగా బ్రెయిన్ స్ట్రోక్, పక్షవాతంతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యారని, భార్య కూడా అనారోగ్యంతో బాధపడుతున్నారన్నారు. వృత్తి రీత్యా దినసరికూలీగా జీవనం కొనసాగించారని, ఇప్పుడు అనారోగ్యకారణంగా జీవనాధారం లేదని, ఈ కుటుంబ ఆర్థిక స్థితుగతుల కోసం రెడ్ క్రాస్ ప్రతినిధి చిన్నికృష్ణ , రెడ్ క్రాస్ ఎపిఆర్వో నంది.ఉమా శంకర్ తెలియజేసారని, సేవకులు ఉర్లం.శివతేజ పట్నాయక్ తో కలసి, గురువారం చిరుసాయాన్ని అందించామన్నారు. దాతలు వీరికి అండగా నిలవాలని, కనీసం ఇంట్లో బల్బులు కూడా లేవని, మందులు, వైద్య ఖర్చుల నిమిత్తం ఆదుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సేవా కార్యక్రమంలో పుట్ట.జోగులు కుటుంబ సభ్యులు, సిక్కోలు స్వచ్ఛంద సేవ సమితి సభ్యుల బృందం, రెడ్ క్రాస్ ప్రతినిధి చిన్నికృష్ణ, ఎపిఆర్వో నంది.ఉమా శంకర్, స్థానికులు పాల్గొన్నారు.

## త్వరలో చోడవరం భవన నిర్మాణాలు ప్రారంభం

**బార్ అధ్యక్షుడు ఎల్లారావు**

**చోడవరం జూలై 16 జయ జయహే**



చోడవరంలో 24 కోట్ల రూపాయలతో నిర్మించి తలపెట్టి గత ప్రభుత్వాయంలో పనులు ప్రారంభించి నిలిచిపోయిన చోడవరం నాలుగు కోర్టుల భవనాల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నట్టు చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం ఎల్లారావు గురువారం రాత్రి తెలిపారు. ఈ మేరకు గురువారం బార్ స్పోర్ట్స్ సెక్రటరీ బొగ్గ చందు తో కలిసి ఆర్ అండ్ బి అధికారులను కలిసి బిల్డింగ్ నిలిచిపోయిన విషయం గురించి చర్చించారు. అయితే అప్పట్లో పాత కాంట్రాక్టర్ కి బిల్లులు చెల్లించకపోవడంతో పాటు, రివైజ్డ్ కాంట్రాక్ట్ కూడా తనకి ఇప్పించాలని కోర్టులో కేసు దాఖలు చేశారు. అప్పటి నుంచి కూడా నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. అయితే నిధులు లేని మూలంగానే బిల్డింగ్ పనులు ప్రారంభం కాలేదని భావించిన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సంబంధిత అధికారులను కలిసేందుకు గురువారం విజయవాడ వెళ్లగా కోట్లు కేసు ఉన్నట్టు గుర్తించారు. దీంతో ప్రభుత్వ న్యాయవాది (జి పి) వై బాలాజీ ని నీ కలిసి వెంటనే ప్రారంభించే విధంగా కృషి చేయాలని కోరారు. దీనిపై ఉన్నత స్థాయి ఆర్ అండ్ బి అధికారులు స్పందించి సకాలంలో పనులు చేయకపోవడంతో పాత కాంట్రాక్టర్ ని ప్రభుత్వం తొలగించినందున వెంటనే కొత్త టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని కింది అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు. దీంతో వారికి చోడవరం బార్ అసోసియేషన్ తరపున ధన్యవాదాలు తెలిపారు. అలాగే ప్రభుత్వ న్యాయవాదిని కూడా సత్కరించారు.



## ప్రారంభమైన జగన్నాథ రథోత్సవాలు

**పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే**

**మాడుగుల జూలై 16 జయ జయహే**

మాడుగులలో గురువారం శ్రీ జగన్నాథ స్వామి వారి రథోత్సవాలు ప్రారంభమయ్యాయి. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 25 వరకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. సందర్భంగా ఉదయం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఆలయం నుంచి ఇంద్రధ్యమ్నం వరకు పాదయాత్ర నిర్వహించారు. అక్కడ స్వామివారిని కొలువుంచారు . ఈ నెల 25 ఏకాదశి రోజున స్వామివారిని తిరిగి యధా ప్రకారం ఆలయానికి చేర్చుతారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సాయంత్రం స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్న ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆలయ ప్రాశస్త్యం గురించి అర్చకులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ కార్య నిర్వహణ అధికారి, ఆలయ కమిటీ ప్రతినిధులు తెలుగుదేశం పార్టీ నాయకులు పి రమేష్, పి నారాయణమూర్తి, జిల్లా ఐ వి ఎఫ్ అధ్యక్షుడు ఎస్ శ్రీనివాసరావు పలువురు పుర ప్రముఖులు కూటమి నాయకులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.




## మాడుగుల పోలీస్ ఆధ్వర్యంలో అభయ అవగాహన

**మాడుగుల జూలై 16 జయ జయహే**

అభయ అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం మాడుగుల మండలం సాగరం కేజీబీవీ పాఠశాలలో మాడుగుల పోలీస్ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అభయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై నారాయణరావు పాల్గొని అభయ కార్యక్రమం గురించి వివరించారు. ప్రతి కుటుంబంలో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలని మహిళ భద్రత ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. మహిళల భద్రత కోసం అనకాపల్లి జిల్లా పోలీస్ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. మహిళలకు అభివృద్ధి సమాజానికి గౌరవమే తమ ఆశయం అన్నారు. ఎట్టి పరిస్థితులను మహిళలకు అండగా ఉంటామని న్యాయం చేస్తామని వారికి రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చారు. మహిళలు హింసకు వేధింపులకు గురైతే వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని హితవు పలికారు. ముఖ్యంగా అమ్మాయిలు ఆకతాయిల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అలాంటి వారిపై ప్రత్యేకంగా ఉంచాలని అవసరమైతే వారి వివరాలు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు.



## పుష్కరిని అభివృద్ధికి 30,000 విరాళం

**చోడవరం జులై 16 జయ జయహే**

చూడడంలో గల శ్రీ స్వయంభు గౌరవిశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో చేపట్టిన పుష్కరిణి అభివృద్ధికి చోడవరం గాంధీ గ్రామానికి చెందిన శ్రీ సోలాపురమ్మ కళాసి సంఘం 30000 రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని గురువారం సంఘ ప్రతినిధులు స్థానిక ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ రాజు కి అందజేశారు. దీంతో కలసి సంఘం వారిని ఎమ్మెల్యే అభినందించారు.

## కుటుంబ కలహాలతో ఉద్యోగిని ఆత్మహత్య

**భార్యాభర్తల మధ్య గొడవ మనస్పర్ధలతో గృహిణి మృతి**

**టెక్కలి జూలై 16 జయ జయహే**



శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలంలోని జగతిమెట్ట జగదాత్రి కాలనీలో నివాసముంటున్న ధవళ అనిత (43)భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు ఏర్పడి తీవ్ర మనస్థాపనతో ఆత్మహత్యకు పాల్పడి ప్రాణాలు కోల్పోయింది. అనిత విజయనగరం లో జీఎస్టీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తోంది, ఈమె భర్త జన్ని హరి సంతబొమ్మాలి మండల తహసిల్దార్ కార్యాలయంలో డి టి గా పనిచేస్తున్నారు, వీరిద్దరూ 15 ఏళ్ల క్రిందట కులాంతర వివాహం చేసుకున్నారు, ఆరవ తరగతి చదువుతున్న కుమారుడు కూడా ఉన్నారు. భార్యాభర్తలిద్దరికీ గత కొన్ని ఏళ్ళుగా ఇద్దరి మధ్య మనస్పర్ధలతో కుటుంబ కలహాలు జరుగుతున్నాయని సమీప బంధువులు చెబుతున్నారు. భర్త మరో ఆమె తో అక్రమ సంబంధం ఉన్నట్లు అనిత పలు సార్లు ఆరోపించినట్లు కుటుంబ సభ్యులు ఆవేదన చెందారు, టెక్కలి పోలీస్ స్టేషన్లో వీరి పంచాయతీ జరిగినప్పటికీ ఎలాంటి మార్పు రాకపోవడంతో తీవ్రమైన మునస్థాపానికి గురైన అనిత బుధవారం రాత్రి ఆత్మహత్యకు పా ల్పడినట్లు తెలుస్తుంది, సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటనపై సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తున్నారు, భర్త హరి ను విచారణ నిమిత్తం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు,మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆమె సొంత గ్రామం గోపీనాథ పురం గ్రామస్తులు తీవ్ర విషాదం వ్యక్తం చేస్తున్నారు.

# జగన్నాథ రథయాత్ర... ఆధ్యాత్మిక శోభా యాత్ర!

## - టౌన్ కొత్త రోడ్డు నుంచి పూర్ణా మార్కెట్ వరకు శ్రీ జగన్నాథ రథయాత్ర
## - యాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్





**విశాఖపట్నం, జూలై 16, జయ జయహే**

టౌన్ కొత్త రోడ్డు నుంచి పూర్ణా మార్కెట్ వరకు శ్రీ జగన్నాథ రథయాత్రలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రథయాత్రను ప్రారంభించారు. జై జగన్నాథ్ నినాదాలతో కొనసాగిన ఆధ్యాత్మిక శోభ యాత్రలో సాంస్కృతిక , సాంప్రదాయ భజన బృందాలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో శోభయానంగా సాగిన యాత్రలో భారీ సంఖ్యలో భక్తజనం హాజరయ్యారు. మునుపెన్నడూ లేని విధంగా భారీ సంఖ్యలో భక్తజనం తరలి వచ్చారు. విశాఖపట్నం టౌన్ కొత్త రోడ్డు వద్ద నిర్వహించిన శ్రీ జగన్నాథ స్వామి వారి కల్యాణ రథయాత్ర మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. టౌన్ కొత్త రోడ్డు నుంచి పూర్ణా మార్కెట్ వరకు రథయాత్రలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ భక్తులతో కలిసి కాలినడకన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు "జై జగన్నాథ" నినాదాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. మేలతాళాలు, మంగళ వాయిద్యాలు, సాంప్రదాయ సాంస్కృతిక నృత్యాలు, భజన బృందాల ప్రదర్శనలతో రథయాత్ర శోభాయమానంగా కొనసాగింది. చిన్నా పెద్దా తేడా లేకుండా వేలాదిమంది భక్తులు భారీ సంఖ్యలో హాజరై స్వామివారి రథయాత్రను దర్శించుకుని భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. గతంలో ఎన్నడూ లేని విధంగా భక్తజనం తరలిరావడంతో రథయాత్రకు విశేష ఆదరణ లభించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, జగన్నాథ స్వామివారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఇటువంటి ఆధ్యాత్మిక వేడుకలు సమాజంలో ఐక్యతను, సనాతన సంప్రదాయాలను మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలోఆలయ ఈవో, కూటమి సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, బఆలయ కమిటీ చైర్మన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల ప్రముఖులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రథయాత్ర వేడుకలో గ్రీన్ పార్క్ వద్ద పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు..



# తెలుగుదేశం క్లస్టర్ బూత్ ఇన్చార్జిల సమావేశం

**అనకాపల్లి జయ జయహే**

స్థానిక గవరపాలెం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 81వ డివిజన్ ముఖ్య నాయకుల కో క్లస్టర్ బూత్ ఇన్చార్జి ల సమావేశాలు 81వ టిడిపి ఇన్చార్జ్ గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర ఆధ్వర్యంలో ఈ సమావేశాలు నిర్వహించారు ఈ సమావేశంలో టిడిపి ఇన్చార్జి పీలా గోవింద సత్యనారాయణ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ సర్ ప్రక్రియ ఈనెల 24 వరకు గడువు పొడిగించడం హర్షించదగ్గ విషయమని ఈ సర్ ప్రకటించిన గడువు లాగా పూర్తి చేయాలని తెలుగుదేశం పార్టీ నాయకులు బి ఎల్ ఏ లను ఆదేశించడం జరిగింది. ఆయన వర్చువల్ గా పాల్గొని టెలి కాన్ఫరెన్స్ ద్వారా టిడిపి నాయకులతో కార్యకర్తలతో మాట్లాడే సర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరు చురుగ్గా పాల్గొని అర్హత కలిగిన ఏ ఒక్క ఓటు కూడా పోవడానికి వీలులేదని ఆయన అనడం జరిగింది . ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలు ప్రతి ఒక్కరు మరియు బిఎల్వోలు సర్ ప్రక్రియలో చురుగ్గా పాల్గొని ప్రభుత్వం అనుకున్న పనిని అనుకున్నట్లుగా పూర్తిగా విజయవంతం చేయాలని మరో పది రోజులు పొడిగించారు కాబట్టి ఇంకా ఎక్కడ నమోదు కాకుండా ఉన్న వారిని గుర్తించి సర్ ప్రక్రియలో కి తీసుకురావాలని పూర్తి విజయవంతం చేయాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో టిడిపి పరిశీలకులు వరసిద్ధి అనంతలక్ష్మి తెలుగుదేశం పార్టీ నాయకులు ఎస్ఎఫ్ఐ సత్యనారాయణ, బొలిశెట్టి శ్రీనివాసరావు, వేదుల సూర్యప్రభ, దాడి వాసు, తణుకు రవి, సాలపు నాయుడు, మల్ల సూరిబాబు, పీల రమణారావు, వానపల్లి కోటేశ్వరరావు, ఎండకుర్తి అప్పలరాజు, జామి రాజు, అనకాపల్లి రాము, ఎండపల్లి శేఖర్ వేగి సూరిబాబు, దొడ్డి రామ గో విందు, పవన్, రామోజీ, శ్యాంసుందర్,చెన్నారావు ఆళ్ల రవికుమార్, నంద్యాల గణేష్ తదితరులు పాల్గొన్నారు



# ముంచంగిపుట్టులో 400 కేజీల గంజాయి పట్టివేత

## పట్టుబడిన గంజాయి రూ.2 కోట్ల ఇద్దరు స్మగ్లర్లు అరెస్ట్

**ముంచంగిపుట్టు, జయ జయహే**

అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలంలో గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు భారీగా ఉక్కుపాదం మోపారు. ప్రత్యేక సమాచారంతో ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం నిర్వహించిన తనిఖీల్లో సుమారు 400 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని మార్కెట్ విలువ సుమారు రూ. 2 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. అందుకు సంబంధించి జి. మాడుగుల సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ ) ఎస్. లక్ష్మణరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు సీఐ పర్యవేక్షణలో స్థానిక ఎస్సై పి. నాని ఆధ్వర్యంలో మండలంలోని లబ్బూరు గ్రామ సమీపంలోని గురువారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించడం జరిగింది. ఆ సమయంలో ఒడిస్సా వైపు నుంచి ఇటుగా వస్తున్న ఒక స్కార్పియో వాహనాన్ని పోలీసులు నిలిపి తనిఖీ తనిఖీలు చేయడం జరిగింది. అందులో ప్లాస్టిక్ సంచుల్లో గంజాయి ఉన్నట్లు గుర్తించి గంజాయితో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నాం. అలాగే వాహనంలో ఉన్న ఇద్దరు గంజాయి స్మగ్లర్లను అదుపులోకి తీసుకోవడం జరిగింది. రెవెన్యూ అధికారుల సమక్షంలో గంజాయిని తూనిక వేయగా 12 సంచుల్లో ఉన్న గంజాయి మొత్తం 400 కిలోలుగా నిర్ధారణ అయింది. దీని విలువ సుమారు మార్కెట్లో రెండు కోట్ల వరకు ఉంటుంది. అలాగే దీనిపై విచారణ చేపట్టగా ఒడిశా రాష్ట్రం మల్కనగిరి జిల్లా చిత్రకొండ బ్లాక్ నుంచి కోరాపుట్టు జిల్లా జైపూర్ వైపు ఆంధ్ర మీదుగా గంజాయిని తరలించేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. పట్టుబడిన ఇద్దరు గంజాయి స్మగ్లర్లు ఒడిశా రాష్ట్రానికి చెందిన అభిజిత్, ఘన శ్యామ్ లుగా గుర్తించడం జరిగింది. ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని సిఐ వివరించారు ఈ గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతూ పరారీలో ఉన్న వారిని సైతం త్వరలో పట్టుకుంటామని ఆయన తెలిపారు. ఎవరైనా గంజాయి అక్రమ రవాణా చేసిన, సాగు చేపట్టిన, వాటికి ప్రోత్సహించిన శిక్షణ అవుతారని సిఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులతో పాటు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా
# జగన్నాధుని రథయాత్ర

**ముంచంగిపుట్టు. జయ జయహే:**



అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండల పరిధిలోగల కొండపడ దారెల తదితర ప్రాంతాలలో గురువారం జగన్నాథస్వామి రథయాత్ర అంగరంగ వైభవంగా జరిగింది. కొండపడ జగన్నాథ స్వామి ఆలయం వద్ద నిర్వహించిన రథయాత్రకు ఆ ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగారు. రథయాత్ర సందర్భంగా మండల నలుమూలల నుంచి భక్తులు తరలి వచ్చారు.జగన్నాథస్వామి, బలభద్రుడు, సుభద్రాదేవుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి రథంపై ప్రతిష్ఠించారు. అనంతరం రథయాత్ర ఉత్సవం ఘనంగా ప్రారంభమైంది. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కళకళలాడింది. భక్తులు భజనలు, కీర్తనలు చేస్తూ స్వామివారికి జయజయధ్వానాలు పలికారు. రథయాత్ర మార్గమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, నిర్వాహకులు భక్తులకు తాగునీరు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేశారు. రథయాత్రలో మహిళలు, యువకులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.



# శ్రీ సత్యసాయి 5కే రన్...!

## జిల్లా యంత్రాంగం సంపూర్ణ సహకారం

**పుట్టపర్తి, జూలై 16, జయ జయహే**

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య అనుగ్రహంతో ఈ నెల 26న పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి హిల్ వ్యూ స్టేడియంలో నిర్వహించనున్న "శ్రీ సత్యసాయి 5కే రన్ అండ్ రైడ్ – ఎ స్పిరిట్ ఆఫ్ యూనిటీ" కార్యక్రమానికి శ్రీ సత్య సాయి జిల్లా యంత్రాంగం నుంచి విశేష ప్రోత్సాహం లభించింది. శ్రీ సత్యసాయి సేవా సంస్థలు రాష్ట్ర అధ్యక్షులు ఆర్. లక్ష్మణ రావు నాయకత్వంలో జిల్లా అధ్యక్షులు కె. సూర్యనారాయణ మూర్తి, రాష్ట్ర యువజన సమన్వయకర్త సి గౌతవ్‌తో కూడిన ప్రతినిధి బృందం గురువారం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, అలాగే శ్రీ సత్యసాయి జిల్లా రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్‌డీవో) కుమారి పి. సువర్ణను మర్యాదపూర్వకంగా కలిసి కార్యక్రమానికి సంబంధించిన అనుమతి పత్రం, అధికారిక ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ యువతలో ఐక్యత, శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, మానవతా విలువలు, జాతీయ సమైక్యతను పెంపొందించే ఈ మహత్తర కార్యక్రమాన్ని అభినందించి, కార్యక్రమం విజయవంతానికి జిల్లా యంత్రాంగం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా, జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా జిల్లా విద్యాశాఖాధికారి, జిల్లా బీసీ సంక్షేమ అధికారిలకు అవసరమైన సూచనలు జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు.




# ఎసఐఆర్ ప్రక్రియలో పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలి

## అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్

**విశాఖపట్నం, జూలై 16, జయ జయహే**

ఎసఐఆర్ ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న పనులను నిర్దేశిత గడువులోగా వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ–2026 కార్యక్రమం పురోగతిపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ స్థానిక అధికారులతో సమావేశమయ్యారు. గుర్తింపు పొందిన ఓటర్ల పునఃధృవీకరణ, మ్యాపింగ్ సరిగా అవ్వని, అనామలీ కేసులు, ఓటర్ల ఫోటోల నవీకరణ, ఫోటో నాణ్యత నిర్ధారణ, పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ, బుక్ ఏ కాల్ విత్ బీఎల్వో తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆధార్ డేటా ఆధారంగా ఎన్నికల సంఘం అందుబాటులోకి తీసుకువచ్చిన ప్రత్యేక మాడ్యూల్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఈఆర్వోలు, ఏఈఆర్వోలు తమ పరిధిలోని పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, పెండింగ్ కేసుల పరిష్కారంలో వేగం పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎటువంటి లోపాలకు తావులేకుండా, ప్రతి కేసును నిబంధనల ప్రకారం పరిశీలించి, నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విశ్వేశ్వరనాయుడు, ఆర్డీఓలు దిలీప్ చక్రవర్తి, సంగీత్ మాధుర్, అన్ని నియోజకవర్గాల ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎలక్షన్ సెల్ విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల కలను సాకారం చేసేందుకు పోలవరం ప్రాజెక్టు

## - ప్రాజెక్టు పరిశీలన అనంతరం అధికారులతో సమీక్ష
## - కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ...

**ఏలూరు/పోలవరం, జయ జయహే :**




పోలవరం ప్రాజెక్టును 2027 మార్చి నాటికి పూర్తిచేసి రాష్ట్ర ప్రజలు, రైతులకు దశాబ్దాల కలను నిజం చేస్తామని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. కేంద్రమంత్రితో పాటు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్య కుమార్ యాదవ్, రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పి.వి.యన్. మాధవ్, శాసనమండలి సభ్యులు సోము వీర్రాజు, అనవర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అదోని ఎమ్మెల్యే డా.పి.వి. పార్థసారథి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే యన్.ఈశ్వర రావు, విశాఖపట్నం ఎమ్మెల్యే వి.విష్ణుకుమార్ రాజు, ఇరవై సూత్రాల కార్యక్రమం ( వికసిత్ భారత్– స్వర్ణ ఆంధ్ర ప్రదేశ్) అమలు చైర్మన్ లంకా దినకర్, ఏపి ఎస్టీ కమీషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి, తెలుగుభాషా అకాడమీ చైర్మన్ రాయపాటి డేవిడ్ విల్సన్, ఇంజనీరింగు బృందం, వివిధ శాఖలు అధికారులతో పోలవరం ప్రాజెక్టు పనులు పురోగతిపై సుదీర్ఘంగా సమీక్షించారు. పవర్ పాయింటు ప్రజెంటేషన్ ద్వారా పోలవరం ప్రగతి పనులను ఇంజనీరింగు బృందం వివరించారు.

### ఆగస్టు 15కు ఒక్క రోజు ముందు అనకాపల్లికి గోదావరి జలాలు...!

ఈ సందర్భంగా కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో గోదావరి జలాలు స్వాతంత్ర్య దినోత్సవానికి ఒక రోజు ముందే నీటిని విడుదల చేసి అక్కడే అఖండ హారతి కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. పోలవరం పనులు పురోగతినీ ఇకపై ప్రతి నెల ప్రజలకు వెల్లడిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పి.వి.యన్.మాధవ్ మాట్లాడుతూ భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ 12 వసంతాలు, కూటమి ప్రభుత్వం రెండు ఏళ్ళు కాలంలో అభివృద్ధి కార్యక్రమాలు సర్వవేగంగా జరుగుతున్నాయని అన్నారు. నరేంద్రమోడీ వరంతో, పోలవరం పూర్తికి శ్రీకారం చుట్టారని, వచ్చే మార్చి 31వ తేదీకీ మొదటిదశ పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని అన్నారు. ఊహించిన దాని కన్నా ఎక్కువగా పనులు జరుగుతున్నాయని మాకు ఎంతో సంతృప్తి కలిగిందని అన్నారు. సమావేశంలో జిల్లా జాయింటు కలెక్టరు యం.జె. అభిషేక్ గౌడ, పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటరు ఎక్స్ అఫీషియో జాయింటు కలెక్టరు వి.అభిషేక్, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, రంపచోడవరం ఐటిడిఏ పీవో యస్.ప్రశాంత్ కుమార్, ఇంజనీరు ఇన్ చీఫ్ కె.నరసింహా మూర్తి, పోలవరం ఇరిగేషన్ య–సఇ ఆర్.రామచంద్రరావు, ఆర్డీవో యం.వి.రమణ, ఐటిడిఎ పివో కె.రాములు నాయక్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి డా.ముళ్ళపూడి రేణుక, రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు బొల్లిన నిర్మల కిషోర్, రాష్ట్ర బిజెపి ఆర్గనైజేషన్ జనరల్ సెక్రటరీ యన్. మధు కుమార్, గారపాటి సీతారామాంజనేయ చౌదరి, జిల్లా బిజెపి అధ్యక్షులు సి.హెచ్.విక్రమ్ కిషోర్, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు ఐనంపూడి శ్రీదేవి, మెగా ప్రతినిధులు, ఇంజనీరింగు బృందం, అధికారులు, బిజెపి నాయకులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీయే వెన్నుపోటు పార్టీ...!



### ఎమ్మెల్యే వెలగపూడిపై విరుచుకుపడ్డ మొల్లి అప్పారావు

### వైసీపీని ఏమన్నా ఊరుకునేది లేదు

**విశాఖపట్నం, జూలై 16, జయ జయహే :**

విశాఖపట్నం, జూలై 16, జయ జయహే : ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు వైసీపీని "గొడ్డలి పార్టీ" అని విమర్శించడం సరికాదని, టీడీపీని "వెన్నుపోటు పార్టీ" అని ప్రజలే పిలుస్తున్నారని మొల్లి అప్పారావు తీవ్రంగా వ్యాఖ్యానించారు. విశాఖపట్నం జిల్లా పార్టీ కార్యాలయంలో తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మొల్లి అప్పారావు బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ...ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చిన చరిత్ర టీడీపీదేనని, అందుకే ఆ పార్టీకి ఆ పేరు సరిపోతుందని ఎద్దేవా చేశారు. జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్లలో ప్రతి వర్గానికీ సంక్షేమ పథకాలు అందించారని, గ్రామ సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటి వద్దకే తీసుకెళ్లారని గుర్తు చేశారు. కరోనా సమయంలో ఈ వ్యవస్థల వల్లే సమర్థవంతంగా సేవలు అందించగలిగామని పేర్కొన్నారు. 2023లో బోటు ప్రమాదంలో నష్టపోయిన మత్స్యకారులకు 24 గంటల్లోనే కోట్ల రూపాయల పరిహారం అందించిన ఘనత జగన్ ప్రభుత్వానిదేనని చెప్పారు. మత్స్యకార భరోసా, రైతు సంక్షేమం, ఆక్వా రైతులకు అండ, సామాజిక భద్రత వంటి అంశాల్లో వైసీపీ ప్రభుత్వం చేసిన సేవలను ప్రజలు మరచిపోలేరన్నారు. వెలగపూడి రామకృష్ణబాబు చేసిన 128 ఇళ్ల అక్రమాల ఆరోపణలను ప్రస్తావిస్తూ, నిజంగా అలాంటి అక్రమాలు జరిగి ఉంటే రెండేళ్లుగా అధికారంలో ఉన్న ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కేసులు నమోదు చేయకుండా కేవలం రాజకీయ ఆరోపణలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనన్నారు. టీడీపీ ఎన్నికల హామీలైన నిరుద్యోగ భృతి, మహిళలకు ఆర్థిక సహాయం, ఉచిత సిలిండర్లు, ఇతర సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా హామీలు నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. రాష్ట్ర మత్స్యకారుల విభాగం అధ్యక్షులు పేర్ల విజయచంద్ర మాట్లాడుతూ...మత్స్యకారుల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. మత్స్యకారుల సంక్షేమం, భద్రతకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, వారి జీవనోపాధిని కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్ల విజయచంద్ర స్పష్టం చేశారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పళ్ళ దుర్గారావు మాట్లాడుతూ

జిల్లా జనసేన పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. జనసేన పార్టీకి చెందిన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ స్వయంగా జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్‌పై భూకబ్జాలకు సంబంధించిన ఆరోపణలు చేయడం సాధారణ విషయం కాదని, దీనిని ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు అత్యంత సీరియస్‌గా పరిగణించాలని కోరారు. ఈ ఆరోపణలపై ఎలాంటి జాప్యం లేకుండా సమగ్ర, నిష్పక్షపాత విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉమ్మడి స్వాతి దాస్ మాట్లాడుతూ

విశాఖపట్నం ఎమ్మెల్యేలు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై విమర్శలు చేయడానికి ముందు తమ నియోజకవర్గాల్లో ప్రజా సమస్యలపై ఎంత మేర పనిచేశారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి, సింహాచలం భూముల పట్టాల వంటి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యాలయం పర్యవేక్షకులు రవి రెడ్డి పార్టీ , సీనియర్ నాయకులు మువ్వల లక్ష్మి , సుమన్ యాదవ్, ఉమ్మడి దాస్ , ఉమ్మడి కళ్యాణ్ , తదితరులు పాల్గొన్నారు.



## సింగమాల వెంకటాద్రి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే బొజ్జల

**తొట్టంబేడు, జులై 16,జయ జయహే.**

మండలం లోని గుర్రప్ప నాయుడు కండ్రిగ గ్రామం ఎస్సీ కాలనీ లో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సింగమాల భాస్కర్ అన్న సింగమాల వెంకటాద్రి ఇటీవల మృతి చెందారు.గురువారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి వారి స్వగ్రాహానికి విచ్చేసి వారి చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు.



### శ్రీవారిని కోరుకున్న కోరిక

## నెరవేరింది

### స్పీకర్ అయ్యన్నపాత్రుడు.

**తిరుమల, జూలై 16, జయ జయహే.**

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గురువారం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం మీడియాతో మాట్లాడుతూగతంలో తిరుమల వచ్చినప్పుడు తన కుమారుడు విజయ్‌కు రాజ్యసభ సభ్యత్వం లభించాలని శ్రీవారిని మనస్ఫూర్తిగా ప్రార్థించానని తెలిపారు. స్వామివారిని దర్శించుకున్న మూడు రోజులకే రాజ్యసభ అవకాశం రావడం తనకు దైవానుగ్రహంగా భావిస్తున్నానని చెప్పారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ వన్యప్రాణి--పర్యావరణ పరిరక్షణ కమిటీకి తాను ఛైర్మన్‌గా ఉన్నానని, కమిటీ సభ్యులతో కలిసి తిరుపతి జూపార్క్‌ను తనతో పాటుగా ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, నరేంద్ర వర్మతో పాటుగా మరికొందరు సభ్యులతో కమిటీ ఉందన్నారు. ఇప్పటికే విశాఖపట్నం జూను సందర్శించామని తిరుపతి జూను సందర్శించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామన్నారు.ఆసియాలోనే అత్యంత విస్తీర్ణంలో ఉన్న జూపార్క్ తిరుపతిలో ఉన్నప్పటికీ, తగిన సౌకర్యాల లేమితో సందర్శకుల సంఖ్య తక్కువగా ఉందని పేర్కొన్నారు.తిరుపతి జిల్లా కలెక్టర్‌తో సమావేశమై అవసరమైన నిధులు, అభివృద్ధి పనులపై చర్చించి, కుటుంబ సమేతంగా వచ్చే భక్తులు జూపార్క్‌ను సందర్శించేలా సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడించారు.



### విమల విద్యాలయ విద్యార్థులకు

## నోట్ బుక్స్

### పంపిణీ చేసిన అనకాపల్లి పొట్టి శ్రీరాములు ట్రస్ట్

**ఉక్కునగరం, జూలై 16, జయ జయహే :**

ఉక్కు నగరం విశాఖ విమల విద్యాలయ మూసివేసి ఇటీవల ప్రభుత్వ ఆధీనంలో నడుస్తుందని తెలిసి అనకాపల్లి పొట్టి శ్రీరాములు ట్రస్ట్ చైర్మన్ పి మూర్తి నోట్ బుక్స్ పెన్నలు పిల్లలకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మర్తి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు అభిమానిగా ఆయన జీవిత చరిత్ర అందరికీ తెలిసే విధంగా ప్రచారం చేస్తూ నేటి పిల్లలే దేశానికి మూల స్తంభాలు అటువంటి విద్యార్థులు ను ప్రోత్సహించాలని ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు, టి ఎన్ టి యు సి అధికార ప్రతినిధి బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ నారా లోకేష్ పల్లా శ్రీనివాసరావు కృషితో పాఠశాల పునర్వ ప్రారంభమైందని త్వరలో ప్రభుత్వం నుండి విద్యార్థులకు యూనిఫారం షూస్ బుక్స్ రావడం జరుగుతుందని తల్లికి వందనం సొమ్ము తల్లిదండ్రులు అకౌంట్ కి పడుతుందని అన్నారు, ఎవరైనా స్వచ్ఛంద సంస్థలు ఉంటే విశాఖ విమల విద్యాలయం విద్యార్థులకు ప్రోత్సహించాలని కోరారు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనిత స్కూల్ జనరల్ సెక్రెటరీ బి.సత్యనారాయణ పి ఈ టి రవిచంద్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు,



### అన్ని వర్గాలకు మేలు చేసిన

## నాయకుడు ముద్రగడ

### ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెండ్ర వీరన్న

**నరసాపురం జూలై 16, జయ జయహే**

మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కేవలం ఒక వర్గానికి పరిమితమైన నాయకుడు కాదని... ఆయన దశాబ్దాలుగా నమ్ముకున్న సిద్ధాంతం కోసం, పేద ప్రజల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేసిన నిఖార్సైన ప్రజా నాయకుడని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు పెండ్ర వీరన్న అన్నారు. కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం రాజకీయ ప్రస్థానం వ్యక్తిత్వంపై ప్రశంసల జల్లు కురిపించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముద్రగడ రాజీపడని నైజం, నిరుపేదల పక్షపాతిగా పేర్కొన్నారు. ముద్రగడ రాజకీయాల్లో ఉన్నా, బయట ఉన్నా ఎల్లప్పుడూ వెనుకబడిన వర్గాల, పేద ప్రజల ఆశయాల సాధన కోసమే శ్రమించారని, పదవుల కంటే ప్రజల ఆత్మగౌరవమే ముఖ్యమని నమ్మిన అతికొద్ది మంది నాయకులలో ఆయన ఒకరని కొనియాడారు. కాపు సామాజిక వర్గానికి, అలాగే సమాజంలో అణగారిన వర్గాలకు న్యాయం జరగాలని ఆయన చేసిన పోరాటాలు చరిత్రలో నిలిచిపోతాయని, ఆయన పోరాట పటిమ ఎందరికో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. నేటి రాజకీయ వాతావరణంలో ముద్రగడ పాటించే నైతిక విలువలు, ఆయనకున్న సచ్ఛీలత అత్యంత అరుదైనవి. తన వ్యక్తిగత స్వార్థం కోసం కాకుండా, నమ్మిన సిద్ధాంతం కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధపడే మనస్తత్వం ఆయనదని కొనియాడారు

## లోకేష్‌తో గంటా భేటీ

### సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన మంత్రి

**విశాఖపట్నం, జులై 16: (జయ జయహే)**



విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం అమరావతిలో భేటీ అయ్యారు. భీమిలి నియోజకవర్గంలో వివిధ సమస్యలను లోకేష్ దృష్టికి తీసుకువెళ్లగా వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. 2014-19 మధ్యలో ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ కు 5 ఎకరాల భూమిని కేటాయించి శంకుస్థాపన చేశామని, లీజు గడువును పేర్కొనకపోవడంతో సాంకేతిక సమస్య తలెత్తిందని గంటా తెలియజేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వానికి ఫిల్మ్ నగర్ ప్రతినిధులు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. లీజు గడువు పేర్కొంటూ భూమి కేటాయించాలని కోరగా లోకేష్ సానుకూలంగా స్పందించారు. ఎండాడలో ప్రతిపాదించిన కాపు భవన్ కు టీడీపీ ప్రభుత్వం ఎకరం స్థలాన్ని కేటాయించగా వైసీపీ ప్రభుత్వం దాన్ని అర ఎకరానికి కుదించిందని లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. కాపు భవన్ కు ఎకరం స్థలాన్నిస్తూ ఉత్తర్వులు జారీ చేయించాలన్నారు. సింహాచలం గురుకుల పాఠశాలలో నిలిచిపోయిన భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని లోకేష్ భరోసా ఇచ్చారు. సొంత భవనం లేక ఆనందపురం హైస్కూల్ లో నాలుగు తరగతి గదుల్లో నడుస్తున్న జూనియర్ కాలేజీకి గూడు కల్పించేలా నిధులివ్వాలని కోరారు. పద్మనాభం మండలంలో మాన్సాస్ ట్రస్టు జూనియర్ కాలేజీ ఉండడం వల్ల 2014-19 లో తాను విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వ జూనియర్ కాలేజీ మంజూరు చేయలేకపోయిన విషయం లోకేష్ కు చెప్పారు. పద్మనాభంలో జూనియర్ కాలేజీ లేకపోవడంతో ఆ మండలంలోని విద్యార్థులు చదువుకోవడానికి విజయనగరం వెళ్లాల్సి వస్తుందన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మధురవాడ ప్రాంతానికి డిగ్రీ కాలేజీ మంజూరు చేయాలని, పి.హెచ్.సి.ని.. భీమిలి సి.హెచ్.సి.ని 100 పడకల ఆస్పత్రులుగా ఉన్నతీకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా గూగుల్ డేటా సెంటర్ కోసం భూములిచ్చిన తర్లువాడ రైతులకు పరిహారం చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేస్తామని వెల్లడించారు. ప్రత్యేక మహిళ సెజ్ కోసం వంద ఎకరాలు కేటాయించాలని కోరారు. చిల్లపేట చెరువు సుందరీకరణ, ఆనందపురం జంక్షన్ లో అన్న క్యాంటీన్, ఇనాం భూముల సమస్యల పట్ల సానుకూల స్పందన తెలియజేశారు.

## పలాస ఘటనలో

## తప్పు ఎవరూ చేసినా ఉపేక్షించబోం

### హోం మంత్రి అనిత

**విజయనగరం, జులై 16, జయ జయహే**



మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం విజయనగరంలో డిఆర్సి సమావేశంలో హోం మంత్రి అనిత పాల్గొని మీడియాతో మాట్లాడారు. బాధితులను పరామర్శించడానికి వచ్చిన ప్రతిసారి జగన్ రెడ్డి బలప్రదర్శన చేస్తున్నారని దుయ్యబట్టారు. పలాస ఘటనలో తప్పు ఎవరూ చేసినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ ఘటనను కూడా తాము సీరియస్‌గా తీసుకున్నామని స్పష్టం చేశారు. సిదిరి అప్పలరాజు తన బిడ్డను రక్షించుకోవడానికి తపన పడినప్పుడు, ప్రమాదం జరిగిన వెంటనే హాస్పిటలకు తీసుకువెళ్లాలని తపన ఉంటే ఆ మనిషి బ్రతికేవాడు కదా అన్నారు. 16 సంవత్సరాల పిల్లవాడు అయినా నేరం చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటారు అన్నారు. కోడి కత్తి శ్రీను కూడా 18, 19 సంవత్సరాలు వయసు మాత్రమే ఉంటుందన్నారు. కోడి కత్తి కేసులో శ్రీనును ఎన్ని రోజులు జైల్లో పెట్టారని ప్రశ్నించారు. తప్పు ఎవరు చేసినా తప్పు తప్పే అని అన్నారు. గొడ్డలి పార్టీ నీచపు రాజకీయాలు చేస్తోందని ధ్వజమెత్తారు. జగన్ హయాంలో పోలీసులను వాడుకున్నారే తప్పా వారి సంక్షేమాన్ని ఎందుకు పట్టించుకోలేదని అనిత ప్రశ్నించారు. ఎన్‌డీఏ ప్రభుత్వం పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. పోలీస్ శాఖలో ఎన్నో మార్పులు తీసుకొచ్చామని చెప్పారు. హోం శాఖకేంద్ర ప్రభుత్వ నిధులను వందకు వంద శాతం వినియోగిస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో జైల్లో కనీసం సీసీ కెమెరాలు కూడా లేవన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో పెద్ద మొత్తంలో సీసీ కెమెరాలు, డ్రోన్లు ఏర్పాటు చేసామన్నారు. ఈగల్ టీమ్, శక్తి టీమ్స్ అద్భుతంగా పనిచేస్తున్నాయని చెప్పారు.సైబర్ నేరాలపై కూడా ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నామని హోం మంత్రి అనిత అన్నారు.భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు పెండింగ్‌లోని పరిహారం చెల్లిస్తామని మాటిచ్చారు. జిందాల్ పరిశ్రమకు సంబంధించి రైతులకు కూడా పరిహార చెక్కులను వెంటనే చెల్లిస్తామన్నారు.

For a pure tomorrow.. జయహే

# 28, 29 తేదీల్లో అప్పన్న గిరి ప్రదక్షిణ

### ప్రజలకు ముందుగానే రూట్ మ్యాప్‌లపై అవగాహన కల్పించాలి

### ట్రాఫిక్ మళ్లింపు మార్గాలను విస్తృతంగా ప్రచారం చేయాలి

### అధికారులకు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశాలు

**విశాఖపట్నం, జూలై 16, జయ జయహే**




ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్న శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామివారి గిరి ప్రదక్షిణకు లక్షలాది మంది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ట్రాఫిక్ నిర్వహణ, మళ్లింపు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. గిరి ప్రదక్షిణకు సంబంధించిన ట్రాఫిక్ మళ్లింపు మార్గాలు, నో వెహికల్ జోన్లు, ప్రత్యామ్నాయ రూట్లపై ప్రజలకు ముందుగానే పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. రూట్ మ్యాప్‌లను మీడియా, సోషల్ మీడియా, ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై నిర్వహించిన మలి విడత సమీక్ష సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి, డీసీపీలు మేరీ ప్రశాంతి, మణికంఠ, దేవస్థానం ఈవో జె. వెంకటరావు, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ శాఖల వారీగా ఏర్పాట్లను సమీక్షించారు.

**భారీ వాహనాలకు ప్రత్యామ్నాయ మార్గాలు..!**


శ్రీకాకుళం, విజయనగరం వైపు నుంచి విశాఖ నగరంలోకి వచ్చే భారీ వాహనాలను ఆనందపురం హైవే నుంచి సబ్బవరం వైపు మళ్లించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్లు, ద్విచక్ర వాహనాలు అసకపల్లి వద్ద సర్వీస్ రోడ్డులోకి దిగి శీలానగర్ మీదుగా నగరంలోకి చేరుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. భారీ వాహనాలను అనకాపల్లి హైవే కూడలి, కూర్మన్నపాలెం, దువ్వాడ జంక్షన్ల మీదుగా నగరంలోకి మళ్లించేలా ట్రాఫిక్ కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. నగరం నుంచి శ్రీకాకుళం, విజయనగరం వైపు వెళ్లే భారీ వాహనాలను దువ్వాడ, కూర్మన్నపాలెం, అనకాపల్లి హైవే కూడలి మీదుగా మళ్లించాలని, కార్లు, ద్విచక్ర వాహనాలను శీలానగర్, నరవ మీదుగా అసకపల్లి వద్ద హైవేకు చేర్చి, అక్కడి నుంచి గమ్యస్థానాలకు చేరుకునేలా ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేయాలని ఆదేశించారు.

**హనుమంతువాక-మద్దిలపాలెం నో వెహికల్ జోన్..!**

జూలై 28వ తేదీన మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 12 లేదా 1 గంట వరకు హనుమంతువాక నుంచి మద్దిలపాలెం వరకు నో వెహికల్ జోన్‌గా ప్రకటించి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా బీచ్ రోడ్డులోని కురుపాం జంక్షన్ నుంచి అప్పూఘర్ వరకు కూడా నో వెహికల్ జోన్‌గా ప్రకటించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. గిరి ప్రదక్షిణ మార్గంలో భక్తుల రాకపోకలకు, అత్యవసర సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళిక రూపొందించాలన్నారు. అంబులెన్సులు, అత్యవసర సేవల వాహనాలు నిరంతరం రాకపోకలు సాగించేలా ప్రత్యేక కారిడార్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

**జూలై 28న విద్యాసంస్థలకు సెలవుపై పరిశీలన..!**

భక్తుల రద్దీ, ట్రాఫిక్ నియంత్రణను దృష్టిలో ఉంచుకుని జూలై 28వ తేదీన విద్యాసంస్థలకు సెలవు ప్రకటించే అంశంపై విద్యాశాఖ అధికారులతో చర్చించాలని జాయింట్ కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్లను కలెక్టర్ ఆదేశించారు. అదే రోజు మద్యం దుకాణాల మూసివేతకు సంబంధించి కూడా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గిరి ప్రదక్షిణ జరిగే 32 కిలోమీటర్ల మార్గంలో తాగునీరు, బయో టాయిలెట్లు, పారిశుద్ధ్యం, విశ్రాంతి కేంద్రాలు, వైద్య శిబిరాలు, అంబులెన్సులు, మొబైల్ మెడికల్ యూనిట్లు, విద్యుద్దీపాలు, హైమాస్ట్ లైట్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు సంగీత్ మాధుర్, దిలీప్ చక్రవర్తి, దేవాదాయ, జీవీఎంసీ, ఆర్టీసీ, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, విద్యుత్, ఆర్ అండ్ బి, జాతీయ రహదారులు, మత్స్యశాఖ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## జగన్‌తో జాన్ వెస్లీ

**అమరావతి, జూలై 16, జయ జయహే**

తాడేపల్లి లోని మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ని ఆ పార్టీ క్రిస్టియన్ మైనారిటీ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ కలిశారు. ఈ సందర్భంగా క్రైస్తవులకు సంబంధించిన సమస్యల మీద చర్చించి జగన్ కి వినతిపత్రం అందించారు. అలాగే ఇటీవల జగన్ విశాఖపట్నం పర్యటనపై ప్రజలు స్పందిస్తున్న తీరు వివరించారు.

# హోంమినిస్టర్ అనితకు భీశెట్టి వినతి

**విజయనగరం (జయ జయహే)**



విశాఖపట్నం కేంద్రం గా ఏర్పాటు కావలసిన రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు (ఆర్.ఆర్.బీ)ని అమరావతి లో ఏర్పాటు చెయ్యాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసారని అదే జరిగితే ఉత్తరాంధ్ర లోని య-ువత, ప్రజలు తీవ్రంగా నష్టపోతారని వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడి వెనక్కి తీసుకునే లా చూడాలని విజయనగరం జిల్లా ఇంచార్జి మంత్రి రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ని ఏపీ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు గుర-ువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంత్రి కి వినతిపత్రం అందచేసి రాష్ట్ర విభజన జరిగిన తరువాత రైల్వే జోన్ సాధించడానికి 12 ఏళ్ళు పట్టిందని ఇప్పుడు విశాఖపట్నం కేంద్రం గా దక్షిణ కోస్తా రైల్వే కేంద్రం సాధించి జూన్ 1 నుండి పనులు ప్రారంభం అయ్యాక రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు అమరావతి తరలించాలి అనుకోవడం ఉత్తరాంధ్ర కి అన్యాయం చెయ్యడమే నని దేశ వ్యాప్తంగా జోన్ ఎక్కడ ఉంటే అక్కడే రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు ఉంటుందని భీశెట్టి హోం మంత్రి తో అన్నారు ముఖ్యమంత్రి తన నిర్ణయం రద్దు చేసుకోకపోతే తెలుగుదేశం పార్టీ నష్టపోతుందని అయన అన్నారు.

### నీట్ ప్రశ్నపత్రం

# లీకేజీ వ్యవహారం

### 5 లక్షలకు 111 ప్రశ్నలు విక్రయం

### సిబిఐ నివేదికలో వెలుగులోకి కీలక విషయాలు

**(జయ జయహే)**

:నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. రసాయన శాస్త్ర ప్రశ్నపత్రాల సెట్లలోని 111 ప్రశ్నలను రూ.5 లక్షలకు విక్రయించినట్లు ఆధారాలు లభించాయని సీబీఐ తెలిపింది. ఈ మేరకు కేసు దర్యాప్తు వివరాలను ప్రత్యేక కోర్టుకు వెల్లడించింది.ఈ కేసులో నిందితుడిగా ఉన్న కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు శివరాజ్ రఘునాథ్ మోటేగావ్‌కర్ బెయిల్ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ దాఖలు చేసిన నివేదికలో సీబీఐ పలు కీలక ఆధారాలను ప్రస్తావించింది. మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన శివరాజ్.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఔ÷ం) ప్రశ్నపత్రాల రూపకల్పన కమిటీలో సభ్యుడైన పీవీ కులకర్ణి నుంచి నీట్ ప్రశ్నలను సేకరించినట్లు దర్యాప్తు సంస్థ తెలిపింది. కులకర్ణి నిర్వహించిన కోచింగ్ తరగతులకు శివరాజ్ కుమారుడు హాజరయ్యాడని పేర్కొంది. కేసు దర్యాప్తులో భాగంగా శివరాజ్ ఫోన్‌ను పరిశీలించగా.. అందులో 36 ఫొటోలు లభించినట్లు సీబీఐ తెలిపింది. వాటిలో చేతితో రాసిన 132 రసాయన శాస్త్ర ప్రశ్నలు ఉండగా.. అందులో 111 ప్రశ్నలు నీట్ యూజీ 2026 మాస్టర్ పేపర్‌లోని ప్రశ్నలతో సరిపోలినట్లు వెల్లడించింది. రసాయన శాస్త్ర ప్రశ్నలకు సంబంధించిన చేతిరాత నోట్స్ నిందితుడు రాసినవేనని తాము భావిస్తున్నట్లు కోర్టుకు సీబీఐ తెలిపింది. మే 3న జరిగిన నీట్ పరీక్షకు దాదాపు 10 రోజుల ముందు ఈ ఫొటోలు తీసినట్లుగా దర్యాప్తు సంస్థ గుర్తించింది. ఈ కేసులో ఇప్పటివరకు 13 మందిని అరెస్టు చేయగా.. వారందరూ ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నట్లు సీబీఐ తెలిపింది. పేపర్ లీకేజీ ఆరోపణల నేపథ్యంలో మే 3న నిర్వహించిన నీట్-యూజీ 2026 పరీక్షను రద్దు చేసిన సంగతి తెలిసిందే. అనంతరం జూన్ 21న మళ్లీ పరీక్ష నిర్వహించారు. ఈ క్రమంలో నీట్- ప్రశ్నపత్రం లీక్ కేసులో సీబీఐ ఢిల్లీ కోర్టుకు కీలక వివరాలు వెల్లడించింది. మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు శివరాజ్ మోటెగావ్‌కర్ మొబైల్ ఫోన్‌లో 136 చేతిరాత ప్రశ్నల్లో 111 ప్రశ్నలు ఎన్‌టీఏ రూపొందించిన క్వశ్చన్ పేపర్ సెట్‌తో సరిపోలినట్లు సీబీఐ కోర్టుకు తెలిపింది.

### 9వ తరగతిలో మూడో భాషపై

# సుప్రీం అభ్యంతరం

### బోర్డు పరీక్షలకు పునాది వేసే మస్యంలో ఒత్తిడి తగదని వ్యాఖ్య

**(జయ జయహే)**



9వ తరగతి విద్యార్థులకు మూడో భాషను తప్పనిసరి చేయడంపై సుప్రీంకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. బోర్డు పరీక్షలకు పునాది వేసే ఈ దశలో కొత్త భాషను ప్రవేశపెట్టడం విద్యార్థులపై అదనపు ఒత్తిడిని పెంచుతుందని వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో 9వ తరగతిలో మూడో భాషను ప్రవేశపెట్టవద్దని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. సీబీఎస్ఈ అమలు చేస్తున్న మూడు భాషల విధానాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. కొత్త భాషను నేర్చుకోవడం మంచిదేనని, అయితే బోర్డు పరీక్షలకు సన్నద్ధమయ్యే సమయంలో విద్యార్థులపై అదనపు భారం వేయడం సమంజసం కాదని అభిప్రాయపడింది. కొత్త భాషను చిన్న తరగతుల నుంచే బోధిస్తే విద్యార్థులకు అలవాటు కావడానికి సమయం దొరుకుతుందని పేర్కొంది. ఇటీవల సీబీఎస్ఈ 9వ తరగతి నుంచి మూడు భాషల విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంతో తల్లిదండ్రులు, పాఠశాలలు, విద్యార్థుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అమలుకు తగిన సమయం ఇవ్వలేదని, తగిన పాఠ్య పుస్తకాలు అందుబాటులో లేవని, అలాగే ఇతర సౌకర్యాలు కూడా పూర్తి స్థాయిలో లేవని విమర్శలు వచ్చాయి. కాగా, సుప్రీంకోర్టు ప్రస్తుతం ఈ విధానాన్ని పూర్తిగా నిలిపివేయలేదు. అయితే 9వ తరగతిలో మూడో భాషను తప్పనిసరి చేయడంపై కేంద్రం మరోసారి ఆలోచించాలని స్పష్టం చేసింది. ఈ అంశంపై తదుపరి విచారణలో కేంద్రం, సీబీఎస్ఈ తమ వైఖరిని వివరించనున్నాయి.

## వైయస్ జగన్‌ను కలిసిన

# సనపల రవీంద్ర భరత్

**తాడేపల్లి (జయ జయహే)**



**వైఎస్ఆర్సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర బీసీ విభాగం సమీక్షా సమావేశం లో పాల్గొన్న విశాఖ జిల్లా బీసీ అధ్యక్షులు సనపల రవీంద్ర భరత్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ సీపీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసారు ఈసందర్భంగా బీసీల సంక్షేమం కోసం బీసీ విభాగం తరపున కూటమి ప్రభుత్వం మీద నిరంతరం నిరసనల ద్వారా ముందుకు వెళ్ళాలని భరత్ కు జగన్ సూచించారు.**

# వైభవంగా ప్రారంభమైన రథయాత్ర

### తొలి పూజ చేసి ప్రారంభించిన డాక్టర్ కందుల నాగరాజు

### కోలాటం,తప్పేడు గుళ్ళతో ఘనంగా సాగిన రథయాత్ర

### వేలాది మందిగా పాల్గొన్న భక్తులు

**విశాఖపట్నం (జయ జయహే)**

ఆషాఢ శుక్ల విదియ సందర్భంగా వేలాది మంది భక్తుల సమక్షంలో ఉత్కల యువసేవా సమాజంలో ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర వైభవంగా ప్రారంభమైంది. శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం చైర్మన్ డాక్టర్ కందుల నాగరాజు,నళిని దంపతులు ఈ రథయాత్రను ప్రారంభించారు 32 వ వార్డు ఏడుగుళ్ల ప్రాంతంలో డాక్టర్ కందుల నాగరాజు బంగారు చీపురుతో రథాన్ని శుభ్రం చేశారు.అనంతరం స్వామివారి విగ్రహాలను రథంలో ప్రతిష్టించారు.డాక్టర్ కందుల నాగరాజు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన తర్వాతలాంఛనంగా రథయాత్రను ప్రారంభించారు. ఈ దివ్య మహోత్సవం అత్యంత వైభవంగా సాగింది. చాలామంది భక్తులు ఈ రథయాత్రలో పాల్గొన్నారు. కోలాటం అలాగే తప్పేడుగుళ్లుతో స్వామివారి రథయాత్ర విజయవంతంగా కొనసాగింది. ఏడు గుళ్ల ప్రాంతం నుంచి బయలుదేరిన ఈ రథయాత్ర సమీపంలోని మసీదు నుంచి అటు నుంచి కెప్టెన్ రామారావు జంక్షన్ వరకు అటు నుంచి సింహాలి దేవుడు ప్రాంతం నుంచి అల్లిపురం




మెయిన్ రోడ్డు అటు నుంచి విఐపి రోడ్ జంక్షన్ అలాగే నేరాల కోనేరు ప్రాంతం మీదుగా హరిత లాడ్జి నుంచి చావులమదుం మీదుగా అట్నుంచి సమీపంలో శివాలయం దగ్గర ఉన్న మౌర్య హోటల్ వరకు ఈ రథయాత్ర కొనసాగింది.

ఈ సందర్భంగా డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ ఉత్కల యువసేవా సమాజం ఆధ్వర్యంలో గత ఆరు సంవత్సరాల నుంచి ఈ రథయాత్రను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గత ఆరేళ్ల నుంచి తాను ఈ రథయాత్రను ఆ స్వామివారి ఆశీస్సులతో ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ఆ భగవంతుడు తనకు కల్పించిన ఒక మంచి అవకాశం గా భావిస్తున్నట్లు తెలియజేశారు. పురాణాల ప్రకారం, ప్రతి సంవత్సరం ఆషాఢ శుక్ల ద్వితీయ రోజున జగన్నాథ స్వామి తన సోదరుడు బలభద్రుడు, సోదరి సుభద్రతో కలిసి తన అత్తగారి ఇల్లు అని భావించే గుండిచా దేవి ఆలయానికి వెళ్తారని, అక్కడ కొన్ని రోజుల పాటు విశ్రాంతి తీసుకున్న అనంతరం తిరిగి శ్రీమందిరానికి చేరుకుంటారని, ఈ దైవయాత్రనే జగన్నాథ రథయాత్రగా నిర్వహిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా స్వామివారు ఆలయం వెలుపలికి వచ్చి అందరికీ దర్శనమివ్వడం విశేషమని అన్నారు. సాధారణంగా ఆలయంలోకి ప్రవేశించలేని వారు కూడా రథయాత్ర సమయంలో స్వామివారిని దర్శించుకునే అవకాశం పొందుతారని, అందుకే దీనిని "ప్రజల మధ్యకు వచ్చే దేవుడి ఉత్సవం"గా కూడా అభివర్ణిస్తారని పేర్కొన్నారు. రథయాత్ర విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన పోలీసు డిపార్ట్మెంట్ కి ,అలాగే జీవీఎంసీ అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్కల యువసేవా సమాజం అధ్యక్షులు రమేష్ పాడి, కార్యదర్శి ప్రవీణ్ మహంతి, కోశాధికారి సుదర్శ  పాడి, కందుల బద్రీనాథ్, కందుల కేదార్నాథ్, కే.కృష్ణ, సిపిఐ బుజ్జి, కె.అప్పారావు పి.రమేష్, నీలిమ, హేమ తదితరులు పాల్గొన్నారు

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com